కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ శనివారం 25 జనవరి 2025
సంపుటి: 14, సంచిక: 296 పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## యాక్షన్ టీం కమాండర్ అరెస్ట్




2

## మేడ్చల్‌లో వివాహిత దారుణ హత్య



బండరాలతో కొట్టి హత్య చేసి పెట్రోల్ పోసి దహనం


2

### నెలకు ఆరున్నర వేల కోట్ల

# వడ్డీ కడుతున్నాం

## అప్పుల కుప్పకు వడ్డీలు కట్టలేక పోతున్నాం

- కేసీఆర్ ఫోటోను పెట్టుకుంటా..
- నాకు ఇష్టమైతేనే రేవంత్ రెడ్డి ఫోటో పెడతా అన్న
- పటాన్ చెరు ఎమ్మెల్యే వ్యవహారంపై విచారణ
- గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదు
- పీసీసీ సమావేశంలో చీఫ్ మహేశ్ కుమార్




**హైదరాబాద్ జనవరి 24(నిఘా న్యూస్):** భారాస గత పదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. భారాస ప్రభుత్వం తెచ్చిన పెట్టుబడులూ పెద్దగా ఏమీ లేవని చెప్పారు. ప్రతిపక్షాలు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'దావోస్‌లో ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లడం వల్లే పెట్టుబడిదారులకు నమ్మకం కుదిరింది. తెలంగాణ పెవిలియన్ రద్దీగా మారింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు ముందుకొచ్చాయి. మమ్మల్ని విమర్శించే ప్రతిపక్షాలు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. ప్రజలను మభ్యపెట్టడం

..మిగతా 2లో



### ముగిసిన సీఎం రేవంత్‌రెడ్డి

## దావోస్ పర్యటన

### శంషాబాద్ ఎయిర్ పోర్టులో కాంగ్రెస్ శ్రేణులు, నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం

**హైదరాబాద్ జనవరి 24(నిఘా న్యూస్):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ముగిసింది. రాష్ట్రంలో భారీ పెట్టుబడులే లక్ష్యంగా సాగిన ఆయన పర్యటన విజయవంతమైంది. దుబాయ్ మీదుగా శుక్రవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు, నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సింగపూర్, దావోస్ పర్యటనలను విజయవంతం చేసి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకొచ్చారంటూ ప్రశంసించారు. కాగా, దావోస్‌లో వివిధ సంస్థలతో రూ.1,78,950 కోట్ల పెట్టుబడులపై తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. తాజా ఒప్పందాలతో సరికొత్త రికార్డు సృష్టించగా.. దాదాపుగా 50 వేల ఉద్యోగాలు రానున్నాయి. మొత్తం 20 సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి బృందం భారీగా పెట్టుబడులు సమీకరించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సరికొత్త రికార్డులు నెలకొల్పింది. మొత్తం రూ.1,78,950 కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు సాగగా.. గతంతో పోలిస్తే ఈసారి మూడిరతలకు మించి ఇన్వెస్ట్‌మెంట్స్ సమీకరించింది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సారథ్యంలో

..మిగతా 2లో

### ముగిసిన చంద్రబాబు

## దావోస్ పర్యటన



నేరుగా అర్ధరాత్రి ఢిల్లీకి చేరిక కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ సాయంత్రం విజయవాడకు చేరుకున్న సీఎం

2

## ప్రపంచంలో టాప్ 5గా అమరావతి నిర్మాణం




- ఫిబ్రవరి రెండవ వారం నుంచి రాజధాని పనులు ప్రారంభం
- ఈ నెలాఖరులోగా టెండర్ ప్రక్రియ పూర్తి
- పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

**అమరావతి జనవరి 24 (నిఘా న్యూస్):** ఫిబ్రవరి రెండవ వారం నుంచి రాజధాని పనులను ప్రారంభిస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ ప్రకటించారు. రాజధానిలో శాశ్వత సచివాలయం, హైకోర్టు భవనాల పునాదులలో నిల్వ ఉన్న నీటిని తోడివేసే పనులను మంత్రి శుక్రవారం పరిశీలించారు. టవర్లు, హైకోర్టు రాఫ్ట్ ఫౌండేషన్ వద్ద నీటి పంపింగ్ వద్ద జరుగుతున్న పనుల గురించి ఆరా తీశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజధాని పనులకు సంబంధించి ఇప్పటివరకు 40 టెండర్లు పిలిచామని అన్నారు. జనవరి నెలలోగా టెండర్ల పక్రియ పూర్తి చేసి ఫిబ్రవరి రెండవ వారంలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. న్యాయపరమైన అంశాల కారణంగా పనుల ప్రారంభం ఆలస్యమైందన్నారు. 2015

..మిగతా 2లో

### గోదావరి జలాలు తరలిస్తుంటే ఏం చేస్తున్నారు

బాబుకు రేవంత్ గురు దక్షిణ చెల్లిస్తున్నారా మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు




**హైదరాబాద్ జనవరి 24(నిఘా న్యూస్):** మెగా కృష్ణారెడ్డి కంపెనీతో ఒప్పందానికి దావోస్ వెళ్లాలా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు చురకలంటించారు. జూబ్లిరోడ్డుకు అటు వైపు సీఎం రేవంత్ రెడ్డి ఉంటారని.. ఇటు వైపు మెగా కృష్ణారెడ్డి ఉంటారని వివరించారు. దావోస్ టూర్‌కు సీఎం రేవంత్ రెడ్డి దారి ఖర్చులు వృధా చేశారని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే హరీష్ రావు విలేకరులతో మాట్లాడుతూ గోదావరి జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకి అన్యాయం జరుగుతుంటే.. రేవంత్ సర్కార్ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ నిప్పులు చెరిగారు. ఏపీని ఆపడం చేతకాకుంటే.. అఖిల పక్షాన్ని తీసుకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు సూచించారు. ఈ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి. గురదక్షిణ చెల్లించు కొంటున్నట్లు అనుమానం కలుగుతోందని హరీష్ రావు అభిప్రాయపడ్డారు. బనకచర్ల ద్వారా

..మిగతా 2లో

### దేశవ్యాప్తంగా పేదలకు

## కోటి ఇండ్ల నిర్మాణం

తెలంగాణకు అదనంగా ఇవ్వడానికి సిద్ధం కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ వెల్లడి అభివృద్ధి తప్ప రాజకీయం లేదన్న బండి



**కరీంనగర్, జనవరి 24(నిఘా న్యూస్):** ఈ ఏడాది దేశవ్యాప్తంగా కోటి ఇండ్లను నిర్మించబోతున్నట్లు కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ అన్నారు. తెలంగాణకు రావాల్సిన వాటా కంటే ఎక్కువ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. కరీంనగర్ డంప్ యార్డ్‌ను ఎత్తేస్తాం. అందుకు అవసరమైన

..మిగతా 2లో



### రాత్రికి రాత్రే ఆలయ నిర్మాణాలు

## చేపట్టడం దారుణం

అంబర్ పేట ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం భూ సేకరణ చేయని ప్రభుత్వం

త్వరలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీచే ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఫర్నిచర్ పంపిణీ చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2

## రాజకీయాల నుంచి తప్పుకుంటునా్న



వైకాపాలో విజయసాయి రాజకీయ కలకలం

రాజ్యసభకు కూడా రాజీనామా చేస్తున్నట్లు వెల్లడి

తనను ఆదరించిన జగన్‌కు కృతజ్ఞతలు వెల్లడి

**అమరావతి, జనవరి 24 (నిఘా న్యూస్):** రాజకీయాల నుంచి తప్పుకొంటున్నట్టు వైకాపా రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తెలిపారు. రాజ్యసభ సభ్యత్వానికి ఈనెల 25న రాజీనామా చేస్తున్నట్టు ట్వీట్ చేశారు. విజయసాయిరెడ్డి రాజ్యసభ పదవీకాలం 2028 జూన్ వరకు ఉంది. మరో మూడేళ్ల పదవీకాలం ఉండగానే ఆయన రాజీనామా ప్రకటన చేయడం వైకాపాలో కలకలం రేపింది.'ఏ రాజకీయ పార్టీలో చేరను. వేరే పదవులు, ప్రయోజనాలు ఆశించి రాజీనామా చేయడం లేదు. ఈ నిర్ణయం పూర్తిగా నా వ్యక్తిగతం. ఎలాంటి ఒత్తిళ్లు లేవు. ఎవరూ ప్రభావితం చేయలేదు. నాలుగు దశాబ్దాలుగా, మూడు తరాలుగా

..మిగతా 2లో



2

### పసిడి ధరలు

## మరింత పైపైకి

83వేలు దాటిన పదిగ్రాముల బంగారం ధర

# దేశవ్యాప్తంగా పేదలకు కోటి ఇండ్ల నిర్మాణం

మొదటి పేజీ తరువాయి...

నిధులన్నీ కేంద్రమే మంజూరు చేస్తుందని అన్నారు. . విద్యుత్ విషయంలోనూ తెలంగాణకు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నా‘ అని కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభాలు చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో కరీంనగర్‌కు చేరుకున్న ఖట్టర్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రమంత్రి శంకుస్థాపనలు చేశారు. కరీంనగర్ లో 24 గంటల తాగునీరు, మల్టీ పర్పస్ పార్క్‌ను కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, బండి సంజయ్ కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం హౌజింగ్ బోర్డు కాలనీలో జరిగే బహిరంగ సభలో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగించారు.



ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండిసంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో తనకు ఎలాంటి విభేధాలు లేవని అన్నారు. గంగుల కమలాకర్‌తోనే కొద్దిగా గ్యాప్ ఉందని త్వరలో అదికూడా సెట్ అయిపోతుందన్నారు. కరీంనగర్‌ను అభివృద్ధి చేయడమే తనకు తెలుసన్నారు. జిల్లా అభివృద్ధి కోసం రాజకీయాలలకు అతీతంగా కలిసి పనిచేయాలని కోరుతున్నామన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం కంకణం కట్టుకున్నానన్నారు. కరీంనగర్‌లో నాలుగు వేల ఇండ్లకు నిరంతరాయంగా 24 గంటల పాటు నీళ్లు సరఫరాల అవుతాయన్నారు. పేదరికం నుంచి హర్యానా సీఎంగా, కేంద్రమంత్రిగా ఎదిగిన మనోహర్ చేతుల విరీదుగా ఈ కార్యక్రమం జరగడం ఎంతో గర్వకారణమన్నారు. కరీంనగర్‌లో డంప్ యార్డ్‌తో ప్రజలు అల్లాడిపోతున్నారని.. డంపింగ్ యార్డు సమస్య నుంచి కరీంనగర్ ప్రజలకు విముక్తి కల్పిస్తామన్నారు. స్మార్ట్ సిటీ నిధులను దారి మళ్లిస్తే కొట్లాడి సాధించినట్లు తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాదం స్కీంలో చేరుస్తున్నామని తెలిపారు. అలాగే కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను రామాయణ్ సర్క్యూట్‌లో చేరుస్తామన్నారు. సిరిసిల్ల, వంగర ప్రాంతాల్లో నవోదయ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని కూడా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం 10 ఏళ్లలో తెలంగాణకు 12 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, రోడ్ల కోసమే లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, రాష్ట్రంలోని 32 జిల్లాల్లో జాతీయ రహదారులను అభివృద్ధి చేశామని బండి సంజయ్ వెల్లడించారు.



## రాజకీయాల నుంచి తప్పుకుంటున్నా

మొదటి పేజీ తరువాయి...

నన్ను నమ్మి ఆదరించిన వైఎస్ కుటుంబానికి రుణపడి ఉన్నాను. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చిన జగన్, నన్ను ఇంతటి ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన భారతికి సదా కృతజ్ఞుడిని. జగన్‌కి మంచి జరగాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ‘పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా, రాజ్యసభలో ఫ్లోర్ లీడర్‌గా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా.. పార్టీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కృషి చేశా. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వారధిలా పనిచేశా. దాదాపు తొమ్మిదేళ్ల పాటు ప్రోత్సహించి కొండంత బలాన్ని, మనోధైర్యాన్నిచ్చి తెలుగు రాష్ట్రాల్లో నాకు గుర్తింపునిచ్చిన ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ప్రత్యేక ధన్యవాదాలు. తెదేపాతో రాజకీయంగా విభేదించా. చంద్రబాబు కుటుంబంతో వ్యక్తిగతంగా విభేదాలు లేవు. పవన్ కల్యాణ్‌తో చిరకాల స్నేహం ఉంది. నా భవిష్యత్తు వ్యవసాయం. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఆదరించిన రాష్ట్ర ప్రజలు, మిత్రులు, సహచరులు, పార్టీ కార్యకర్తలకు.. ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు‘ అని విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు.

## మేడ్చలో వివాహిత దారుణ హత్య

**మేడ్చల్ జనవరి 24(నిఘా న్యూస్):** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళను హత్య చేయడంతో పాటు గుర్తు పట్టకుండా ఉండేందుకు పెట్రోల్ పోసి తగలబెట్టిన సంఘటన చోటుచేసుకుంది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మునీరాబాద్ గ్రామ శివారులో వివాహితను హత్య చేసి పెట్రోల్ పోసి తగలబెట్టిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మునిరాబాద్ గ్రామ శివారులోని ఓరర్ బ్రిడ్జి కింద చోటుచేసుకుంది. మేడ్చల్ ఏసిపి తెలిపిన వివరాల ప్రకారం 25 సంవత్సరాల పైబడిన ఓ వివాహితను గుర్తుతెలియని వ్యక్తులు బండరాళ్లతో కొట్టి హత్య చేసి యువతి మొహం కనిపించకుండా పెట్రోల్ పోసి తగలబెట్టినట్లు తెలిపారు. మృతురాలి వయసు 25 నుంచి 30 మధ్యలో ఉంటుందని, మెడలో రోల్డ్ గోల్డ్ చెన్ వేసుకొని ఉందని ఏసిపి తెలిపారు. హత్య జరిగిందని సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే వృత్తిరాలు చేతి పైన ఉన్న పేర్లు ఎవరివి అంటూ పోలీసులు విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎసిపి వెల్లడించారు.

## యాక్షన్ టీం కమాండర్ అరెస్ట్

**చింతూరు జనవరి 24 (నిఘా న్యూస్):** అల్లూరి జిల్లా చింతూరు పోలీస్ స్టేషన్ పరిధి కల్లేరు గ్రామ శివారు కల్లేరు పంచాయతీ అటవీ ప్రాంతంలో ఏసీఎం క్యాడర్ యాక్షన్ టీం కమాండర్ కొంటా ఏరియా కమిటీ మావోయిస్టు పార్టీకి చెందిన కొవ్వాసి సోమడ అలియాస్ ముఖేష్ ను చింతూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్ పాత్రికేయుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొవ్వాసి సోముడా అలియాస్ ముఖేష్ 33 సంవత్స రాల గల మావోయిస్టు యాక్షన్ టీం కమాండర్ పట్టుబడ్డారని, ఇతను సుకుమా జిల్లా చత్తీస్గడ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా తెలి యజేశారు. ఇతను 14 సంవత్సరాల వయసులో కొంట ఏరియా కమిటీ కమాండర్ అయిన వ్యక్తి మంగుడు ఇతనని పెట్టు రామ ఏసీ ఎం లొంగిపోయి ఇన్చార్జిగా ఉన్న కొంట ఏరియా కమిటీ అగ్రికల్చర్ టీంలో పార్టీ మెంబర్ గా నియమించారని తెలియజేశారు. 2016 వరకు పార్టీ మెంబర్గా కొనసాగాడని తెలిపారు. సెప్టెంబర్ 2016 సంవత్సరంలో మడకం నంద ఆధ్వర్యంలో బోరలంక అటవీ ప్రాంతంలో పది రోజులు పాటు జరిగిన మెరిట్ ట్రైనింగ్ లో పాల్గొన్నారని తెలిపారు. ఇతనిపై రెండు నుండి మూడు లక్షల రివార్డు ఉంటుందని తెలిపారు. సోమడా పలు విధ్వంసాలలో పాల్గొన్నారని తెలిపారు. ఆంధ్ర ఒడిస్సా పోలీసులు సంయుక్తంగా నిర్వహిస్తున్న కూంబింగ్ నేపథ్యంలో మందు పాత్ర పేల్చి హతమార్చాలని ఉద్దేశంతో సమడా మావోయిస్టు పార్టీ నాయకులు సానుభూతిపరులు కలిసి వెళుతుండగా కొవ్వాసి సోమడ తన చేతుల్లో ఉన్న క్యానుతో పోలీసులకు పట్టు పడ్డారని తెలియజేశారు.ఆంధ్ర ఒరిస్సా పోలీస్ బలగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న కుంబింగ్ నేపథ్యంలో ఏరియా డామినేషన్ జరుగుతుందని ఎస్పీ తెలిపారు. నిషేధిత మావోయిస్టు పార్టీకి ఎటువంటి సహాయ సహకారాలు అందించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## పసిడి ధరలు మరింత పైపైకి

**న్యూఢిల్లీ,జనవరి 24(నిఘా న్యూస్):** బంగారం ధర మరో మారు అందనంతంగా అమాంతంగా మరింత పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో దీనికి భారీగా డిమాండ్ ఏర్పడింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల పసిడి ధర రూ.83 వేలు దాటింది. ఈ మార్కు దాటడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 99.9 స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడి రూ.200 పెరిగి రూ.83,100కి చేరుకున్నట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం కూడా రూ.200 పెరిగి రూ.82,700కి చేరినట్లు అసోసియేషన్ పేర్కొంది. అటు వెండి సైతం కిలోకు రూ.500 మేర పెరిగింది. క్రితం ట్రేడింగ్‌లో రూ.93,500గా ఉన్న వెండి కిలో తాజాగా రూ.94 వేల మార్కుకు చేరుకుంది. అంతర్జాతీయ విపణిలో బంగారం ఔన్సు 2780 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 31.32 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్ టారిఫ్‌ల విషయంలో ఎలా వ్యవహరిస్తారనే అంశంపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. ఎన్నికల వేళ ప్రపంచ ఆర్థికంపై ప్రభావం చూపేలా వ్యాఖ్యలు చేసిన ట్రంప్.. ఇతర అంశాల్లోనూ మున్ముందు ఎలా వ్యవహరిస్తారనే దానిపైనా ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సురక్షిత పెట్టుబడి సాధనంగా పసిడిని భావిస్తుండడంతో దీనికి డిమాండ్ పెరుగుతోందని యాక్సిస్ సెక్యూరిటీస్‌లో రీసెర్చ్ అనలిస్ట్ దేవేయ గగలానీ అభిప్రాయపడ్డారు. కేంద్రం ప్రవేశపెట్టనున్న బ్జడెట్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయాలు మున్ముందు బులియన్ మార్కెట్లో బంగారం ధర గమనాన్ని నిర్దేశిరచనున్నాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన అనలిస్ట్ జతిన్ త్రివేది పేర్కొన్నారు.

## గోదావరి జలాలు తరలిస్తుంటే ఏం చేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి...

200 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకు పోతుంటే.. రేవంత్ రెడ్డి మౌనంగా ఉండడం వెనుక కారణం ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి విషయంలో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని హరీశ్‌రావు మండిపడ్డారు. గోదావరి నీళ్లను పెన్నాకు తీసుకెళ్లేందుకు ఏపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది అని హరీశ్‌రావు తెలిపారు. గోదావరి నీళ్లను ఏపీకి తీసుకెళ్తుంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది..? బనకచర్ల ఆపాలని ఏపీకి కనీసం లేఖ కూడా రాయలేదు సీఎం రేవంత్ రెడ్డి. నాలుగు ప్రాజెక్టులకు నీళ్ల కేటాయింపులు పెండిరగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టులకు అనుమతుల సాధనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. బనకచర్లకు నిధుల కోసం చంద్రబాబు కేంద్రానికి లేఖలు రాశారు. చంద్రబాబు లేఖపై కేంద్రంలో దస్త్రం కదులుతోంది. చంద్రబాబు నవంబర్‌లో లేఖ రాస్తే సీఎం రేవంత్ ఏం చేశారు. బనకచర్లపై ఏపీ ముందుకెళ్తుంటే సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు. బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుంది. బనకచర్లపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది అని హరీశ్‌రావు మండిపడ్డారు. కృష్ణా జలాల విషయంలో సెక్షన్ 3ని సాధించిందే కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని హరీశ్‌రావు తెలిపారు. ఇప్పుడు సెక్షన్ 3పై ఏపీ సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఏపీ సుప్రీంకోర్టుకు వెళ్తే కనీసం కేవియట్ వేయరా. ప్రభుత్వాన్ని అధికారులు సరిగ్గా మార్గదర్శకత్వం చేయట్లేదు. మంచి అడ్వకేట్లను పెట్టి సెక్షన్ మూడు విషయంలో వాదించాలి కదా..? సాగునీటి మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి విఫలమయ్యారు. మేడిగడ్డను పండబెట్టారు.. పాలమూరును పక్కకు పెట్టారు. ఇప్పటికైనా నదీ జలాలపై రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి. అఖిలపక్షం వేస్తే సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఏపీ మాజీ సీఎస్ ఆదిత్యానాథ్‌ను సలహాదారుగా పెట్టుకున్నారు. ఆదిత్యనాథ్ విషయంలో రేవంత్ గురుదక్షిణ చెల్లించారేమో..? తుంగభద్రను గండికొట్టేందుకు ఏపీ, కర్ణాటక యత్నాలు చేస్తున్నాయి. ఏపీ, కర్ణాటక తుంగభద్రకు గండి కొడుతుంటే సీఎం ఏం చేస్తున్నారు. 2017లో ఏపీ ఇలాంటి ప్రయత్నం చేస్తే గట్టిగా అడ్డుకున్నాం అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

## ప్రపంచంలో టాప్ 5గా అమరావతి నిర్మాణం


మొదటి పేజీ తరువాయి...

జనవరి ఒకటో తేదీన ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ ఇస్తే కేవలం 58 రోజుల్లోనే రైతులు 34 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారని అన్నారు. రాజధాని అమరావతిని ప్రపంచంలో టాప్ 5 లో ఒకటి గా చేయాలని లక్ష్యంగా పెట్టుకొని ఐకానిక్ భవనాలు డిజైన్లను నార్మన్ ఫాస్టర్ చేత చేయించామన్నారు. అధికారులు, ఉద్యోగులు, జడ్జీలు కోసం 2019కు ముందే మొత్తం 4,053 అపార్ట్మెంట్ల పనులు ప్రారంభించామని చెప్పారు. తమపై కక్షతో గత ప్రభుత్వం నిర్మాణాలు ఆపేసిందన్నారు. అసెంబ్లీ ని 250 మీటర్ల ఎత్తులో నిర్మించి సమావేశాల నిర్వహణతో పాటు మిగిలిన రోజుల్లో టూరిజం స్పాట్ గా చేయాలని డిజైన్ చేశామన్నారు. రాష్ట్ర స్థాయి అధికారులు అందరూ ఒకేచోట ఉండేలా ఐదు అడ్మినిస్ట్రేటివ్ టవర్ లు డిజైన్ చేశామని చెప్పారు. కోటి మూడు వేల చదరపు అడుగులతో భవనాలు డిజైన్ చేసి పనులు ప్రారంభించామని, గత ప్రభుత్వం నిర్మాణాలన్నింటినీ నీళ్ళలో పెట్టేసిందని ఆరోపించారు. నీళ్లలో ఉండటంతో నాణ్యత కోసం ఐఐటి నిపుణులతో అధ్యయనం చేయించామని మంత్రి చెప్పారు. విద్యుత్ లైన్ లు, డ్రైనేజీలు, తాగు నీటి పైపులు అన్నీ అండర్ గ్రౌండ్ లో ఉండేలా డిజైన్ చేశామన్నారు. గత ప్రభుత్వం మొత్తాన్ని అడవిగా మార్చేసిందని విమర్శించారు. న్యాయపరమైన కారణాలతో పనుల ప్రారంభం ఆలస్యం అయిందని, ఇప్పటి వరకూ మొత్తం 40 పనులకు టెండర్లు పిలిచామని అన్నారు. జనవరి నెలాఖరు లోగా అన్నీ పూర్తి చేసి ఫిబ్రవరి రెండో వారంలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ డి ఎ, ఇతర శాఖల అధికారులు పాల్గన్నారు.

## దిల్‌రాజు ఇంట్లో ముగిసిన ఐటి సోదాలు

### పత్రాల ఆధారంగా వివరాల సేకరణలో అధికారులు

**హైదరాబాద్, జనవరి 24(నిఘా న్యూస్):** టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఇంట్లో ఐటీ సోదాలు ముగిశాయి. నాలుగు రోజుల పాటు దిల్ రాజు నివాసంలో సుదీర్ఘంగా తనిఖీలు చేసిన ఐటీ అధికారులు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఐటీ సోదాలు ముగిసిన తర్వాత దిల్‌రాజును శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కార్యాలయానికి తరలించారు. దిల్ రాజు ప్రొడక్షన్స్ కార్యాలయాల్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. రెండేళ్లుగా నిర్మించిన చిత్రాల వ్యయం, ఆదాయాలపై ఆరా తీస్తున్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఐటీ సోదాల్లో కీలక అంశాలను గుర్తించారు. వచ్చిన లాభాలకు కట్టిన ట్యాక్స్‌కు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. అలాగే సంక్రాంతికి వచ్చిన సినిమాల కలెక్షన్లపై ఐటీ అధికారులు ఫోకస్ పెట్టారు. దిల్‌రాజు ఇంట్లో కీలక పత్రాలను ఐటీ అధికారులు సీజ్ చేశారు. దిల్‌రాజు కార్యాలయంలో కూడా ముఖ్యమైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం లీగల్ ఫార్మల్టీస్‌ను ఐటీ పూర్తి చేస్తోంది. దిల్ రాజ్ ఇళ్లు, కార్యాలయంతో పాటు కూతురు హన్సితా రెడ్డి ఇంట్లో సీజ్ అయిన పత్రాలను అధికారులు వెరిఫై చేస్తున్నారు.



## ముగిసిన చంద్రబాబు దావోస్ పర్యటన

**న్యూఢిల్లీ, జనవరి 24 (నిఘా న్యూస్):** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. దావోస్ ప్రపంచ ఆర్థికవేదిక సదస్సు పర్యటన నుంచి ఆయన నేరుగా ఢిల్లీ చేరుకున్నారు. శుక్రవారం ఉదయం నార్త్‌బ్లాక్‌లోని ఆర్థికశాఖ కార్యాలయంలో నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. సుమారు 45 నిమిషాలపాటు కొనసాగిన ఈ భేటీలో.. రాష్ట్రానికి ఆర్థిక సహకారంపై సీఎం చర్చించారు. ఫిబ్రవరి 1న కేందప్రభుత్వం బ్జడెట్ ప్రవేశపెట్టనున్న తరుణంలో రాష్ట్రం తరఫున విజ్ఞప్తులను ఆమె ముందుంచారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ అమలు, పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి సీఎం ప్రస్తావించినట్లు సమాచారం. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడం ద్వారా భారీగా పెట్టుబడుల ఆకర్షణ కోసం నెట్‌వర్క్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా సాగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగు రోజుల దావోస్ పర్యటన గురువారంతో ముగిసింది. ప్రపంచ పెట్టుబడుల సదస్సులో పాల్గొన్న ఆయన.. ప్రముఖ సంస్థల సీఈవోలు, అధిపతులు, పలు దేశాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. వివిధ రంగాలకు చెందిన సుమారు 15 అత్యున్నత వాణిజ్య సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సుల్లో విరామం లేకుండా గడిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, అందుకు అనువైన పరిస్థితులను వివరించారు. నాలుగు రోజుల దావోస్ పర్యటన ముగించుకుని గురువారం అర్ధరాత్రి పొద్దుపోయిన తర్వాత ఢిల్లీకి చేరుకున్నారు. దావోస్ నుంచి రాష్ట్రానికి తిరిగి వచ్చే ముందు వరకు సీఎం వివిధ సంస్థల అధిపతులు, వివిధ రంగాల ప్రముఖులతో సమావేశమై రాష్ట్రాభివృద్ధి కోసం చర్చలు జరిపారు. ప్రఖ్యాత పర్యావరణవేత్త, చె హోల్డింగ్స్ వైస్ ఛైర్మన్ ఆండ్రీ హాఫ్‌మన్‌తో సమావేశమయ్యారు. యూఎన్‌డీపీ అధిపతి అచిమ్ స్టెయినర్‌తోనూ భేటీ అయ్యారు. దావోస్‌లో 4 రోజులపాటు వివిధ రంగాలకు చెందిన వాణిజ్య సంస్థల ప్రతినిధులతో సీఎం సమావేశమై.. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు. వాణిజ్యాభివృద్ధికి, పారిశ్రామికవేత్తల కోసం తీసుకొచ్చిన పాలసీల గురించి చెప్పారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలు.. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాల గురించి వివరించారు. ఇక్కడి అనుకూల పరిస్థితులను స్వయంగా వచ్చి పరిశీలించాలని పెట్టుబడిదారులను ఆహ్వానించారు. ఢిల్లీలో ఆయనకు మాజీ ఎంపి కంభంపాటి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం శుక్రవారం గన్నవరం విమానాశ్రయం చేరుకున్నారు. మంత్రి కందుల దర్గేశం ఘనంగా స్వాగతం పలికారు.



## ముగిసిన సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ రైజింగ్ బృందం దావోస్‌లో వివిధ పారిశ్రామిక వేత్తలతో నిర్వహించిన సమావేశాలన్నీ విజయవంతమయ్యాయి. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వటం ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలను అమితంగా ఆకట్టుకుంది.

**ప్రముఖ సంస్థల పెట్టుబడుల వివరాలివే..**

అమెజాన్ వెబ్ సర్వీసెస్ - రూ.60 వేల కోట్లు
మేఘా ఇంజినీరింగ్ సంస్థ - రూ.15 వేల కోట్లు
హెచ్‌సీఎల్ సంస్థ - రూ.10 వేల కోట్లు
జేఎస్‌డబ్ల్యూ - రూ.800 కోట్లు, విప్రో - రూ.750 కోట్లు
రూ.500 కోట్లతో స్కైరూట్ ఏరో స్పేస్ తయారీ, పరీక్షా కేంద్రం
టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ రూ.15 వేల కోట్ల ప్రాజెక్టులకు ఒప్పందం.
రూ.5 వేల కోట్ల పెట్టుబడికి అమెరికా సంస్థ ఉర్స్ క్లస్టర్స్ ఒప్పందం.
రూ.7 వేల కోట్ల పెట్టుబడికి మైత్రా గ్రూప్ ఎంవోయూ.
అక్షత్ గ్రీన్ టెక్ - రూ.7 వేల కోట్లు
బ్లాక్ స్టోన్ - రూ.4,500 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి.

వీటితో పాటు ఇన్ఫోసిస్, విప్రో వంటి ప్రముఖ సంస్థలు తమ ప్రాంగణాలను పెద్దఎత్తున విస్తరించనున్నట్లు ప్రకటించాయి. ఎక్లాట్ హెల్త్ కేర్ సొల్యూషన్స్ నూతన ప్రాంగణాన్ని నెలకొల్పనుండగా.. సుహానా మసాలా, ఎకో ఫ్యాక్టరీ ఫౌండేషన్ సంయుక్తంగా ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి. ఆయా సంస్థల ద్వారా రాష్ట్రంలో 25,800 ఉద్యోగాలు రానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాగా.. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మెట్రో విస్తరణకు ప్రభుత్వం ఎంచుకున్న భవిష్యత్తు ప్రణాళికలు పెట్టుబడుల వెల్లువకు దోహదపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న తెలంగాణ రైజింగ్ 2050 విజన్ గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. అన్ని రంగాలకు అనుకూలమైన వాతావరణ మున్న హైదరాబాద్ గ్రేటర్ సిటీ పెట్టుబడుల గమ్యస్థానంగా మరోసారి ప్రపంచానికి చాటిచెప్పినట్లయింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సరళతర పారిశ్రామిక విధానంతో పాటు ఇటీవల ప్రకటించిన క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ ప్రపంచ పారిశ్రామికవేత్తలను దృష్టిని ఆకర్షించింది.

## నెలకు ఆరున్నర వేల కోట్ల వడ్డీ కడుతున్నాం

మొదటి పేజీ తరువాయి...

ఆచరణ సాధ్యంకాని హామీలివ్వడమే భారాస పని. గత ప్రభుత్వ పాలనతో నెలకు రూ.ఆరున్నర వేల కోట్ల వడ్డీ కడుతున్నాం. మంచి పనులు జరుగుతున్నప్పుడు ప్రశంసించడం నేర్చుకోండి. తాజాగా రాష్ట్రానికి రానున్న పెట్టుబడులతో 50 వేల నుంచి 75 వేల ఉద్యోగాలు లభించే అవకాశముంది‘ అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఏ పార్టీ వాళ్ళు అని తాము చూడడం లేదని పెద్దవాళ్ళకి పథకాలు ఇస్తున్నామని వెల్లడిరచారు. పెట్టుబడి పెట్టడానికి అనేక కంపెనీలు వస్తాయని,అందులో మేఘా కృష్ణారెడ్డి కంపెనీ ఒకటన్నారు. పెట్టబడులపై ఎప్పుడంటే అప్పుడు చర్చకు సిద్ధం అంటూ మాజీ మంత్రి కేటీఆర్‌కు, పీసీసీ చీఫ్ సవాల్ విసిరారు. సీఎం దావోస్ పర్యటన తెలంగాణకు ధమాకా అన్నారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణలో ఒక చరిత్ర నెలకొందన్నారు. కాంగ్రెస్ ఉంటేనే పెట్టుబడులు వస్తాయని మరోసారి నిరూపితమైందని తెలిపారు. విదేశీ పెట్టుబడిదారులకు కాంగ్రెస్‌పై నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్ జవాబుదారీతనంపై పెట్టుబడిదారులకు నమ్మకం ఉందన్నారు. రైజింగ్ 2050 నినాదం గేమ్ చెంజర్‌గా మారిందన్నారు. తనకి తాను సుపర్ స్టార్‌గా చెప్పుకునే కేటీఆర్ పదేండ్లలో ఎన్ని పెట్టుబడులు తెచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల కాలంలో 27 వేల కోట్లు మాత్రమే పెట్టుబడులు తెచ్చారని అన్నారు. కేసీఆర్‌కు విజన్ లేకపోవడం వల్లే రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు. ఇకపోతే కేసీఆర్ ఫోటోను పెట్టుకుంటా.. నాకు ఇష్టమైతేనే రేవంత్ రెడ్డి ఫోటో పెడతా అంటూ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సీరియస్ అయ్యారు. గూడెం మహిపాల్ రెడ్డి మాటలను తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై కమిటీ రిపోర్ట్ ఇస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కొత్తగా చేరిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కొంత సమస్య ఉందని కమిటీ వేశామని, కమిటీ అన్ని విషయాలపై అధ్యయనం చేస్తుందని పీసీసీ చీఫ్ చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారన్న అంశంపై కూడా కమిటీ అధ్యయనం చేస్తుందని చెప్పారు. పార్టీలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గతంలో ఎమ్మెల్యేల ద్వారానే లబ్దిదారుల ఎంపిక జరిగిందని తెలిపారు. పటాన్ చెరు నియోజక వర్గంలో పాత కొత్త ఇబ్బందులు ఉన్నాయన్నారు. అలాగే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడిన అంశాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు. కమిటీ పరిశీలన తర్వాత సరైన నిర్ణయం తీసుకుంటామని పీసీసీ చీఫ్ వెల్లడించారు.

## రాత్రికి రాత్రే ఆలయ నిర్మాణాలు చేపట్టడం దారుణం

**అంబర్‌పేట జనవరి 24 (నిఘా న్యూస్):** సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రమంత్రి గంగాపురం కిషన్ రెడ్డి అన్నారు. గోల్నాక తులసీరాం నగర్ (లంక) ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను,అంబర్‌పేట గవర్నమెంట్ పోలీస్ బాయిస్ హై స్కూల్ లో ఫర్నిచర్ ను కేంద్ర మంత్రి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఫర్నిచర్, కంప్యూటర్ ల్యాబ్స్, నోట్ బుక్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.మరికొన్ని పాఠశాలల్లో టాయిలెట్ క్లీనింగ్ మిషన్లు పంపిణీ చేసి, శుభ్రత కోసం చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. 33 సంవత్సరాల తర్వాత దేశంలో ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం వలన విద్యార్థులకు దేశ భవిష్యత్తుకు మేలు జరుగుతుందన్నారు.అన్ని రంగాల్లో మెరుగైన వసతులు కల్పించేలా విద్యావిధానాన్ని తీసుకురావడం జరిగిందని చెప్పారు.ఇప్పుడు దేశంలోని కొన్ని రాష్ట్రాల్లోనే నూతన విద్యావిధానాన్ని కొంతమేరకే అమలు జరుగుతుందని, దాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసినట్లయితే దేశంలో విద్యార్థులకు, దేశ భవిష్యత్తుకు మేలు జరుగుతుందని అన్నారు.ఈ విధానం ప్రాథమిక స్థాయిలోనే ప్రొఫెషనల్ కోర్సులు నేర్పించేందుకు మార్గం సుగమం చేస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ విద్యావిధానం అమలును ప్రారంభించి, విద్యార్థులకు నైపుణ్యాలను నేర్పించడం, సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని అనేకమంది విద్యావంతులు, మేధావులు, సైంటిస్టులు, ప్రొఫెసర్స్ ఆలోచనల మేరకు, వారి అభిప్రాయాలు తీసుకుని నూతన విద్యావిధ్యానాన్ని తీసుకువచ్చిందని,ఇది దేశభవిష్యత్తుకు ఎంతో మేలు చేకూరుస్తుందని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అనేక పాఠశాలలకు నూతన భవనాలను నిర్మించడం జరిగిందని,గోల్నాక తులసీరాంనగర్ (లంక) ప్రభుత్వ పాఠశాలలో మరిన్ని మౌలిక వసతులు కల్పించేలా కృషి చేస్తామని తెలిపారు. అంబర్ పేట ఫ్లైఓవర్ కు సంబంధించి భూసేకరణను జీహెచ్ఎంసీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేయలేదని,రోడ్డు విస్తరణ పూర్తిస్థాయిలో జరగలేదని కేంద్రమంత్రి అన్నారు. ప్రభుత్వం జిహెచ్ఎంసి సహకరించి భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. కొన్నిచోట్ల అక్రమంగా ప్రార్థనా మందిరాలను రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపట్టి రోడ్డు విస్తరణను అడ్డుకుంటున్నారని,అక్రమంగా నిర్మాణాలు చేపట్టేవారిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కోరారు. అంబర్ పేట ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ఆహ్వానిస్తామని ఆయన తెలిపారు.

# ఉద్యోగాలు భర్తీ చేయండి లేకుంటే గద్దె దిగండి




- అమరావతిని ఫ్రీ జోన్ గా మార్చండి
- శ్రీ సిటీలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి
- ఏ ఐ వై ఎఫ్ మహాసభలో వక్తల డిమాండ్

**శ్రీకాళహస్తి, జనవరి 24 (నిఘా న్యూస్):** దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ చేసి యువతకు ఉపాధి కల్పించాలని, ఉద్యోగం ఉపాధి లేక దేశం లో నిరుద్యోగ సమస్య రికార్డు స్థాయిలో పెరుగుతుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు విమర్శించారు. అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ తిరుపతి జిల్లా రెండవ మహాసభ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలో గాంధీ వీధి నుంచి అంబేద్కర్ భవన్ కు వందలాది మంది యువజన కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. జిల్లా మహాసభ సందర్భంగా ఏఐవైఎఫ్ అరణ పతాకాన్ని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ రామానాయుడు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభకు జిల్లా అధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ కాకపోవడంతో నిరుద్యోగం రికార్డు స్థాయిలో పెరుగుతుందని, దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడం నిర్ణయాన్ని విరమించుకొని యువతకు ఉపాధి ఉద్యోగాలు కల్పించి భారతదేశ అభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేయాలని కోరారు. చదువుకున్న యువత ఉద్యోగ లేక వలసలు వెళ్తున్నారు. కేంద్రంలో రాష్ట్రంలో ఎన్డీఏ గవర్నమెంట్ నిరుద్యోగ సమస్య పరిష్కారం పట్ల ఏమాత్రం ఆలోచించడం లేదు అనేకసార్లు మంత్రివర్గ సమావేశాలు జరిగిన వాటిపై ఎందుకు చర్చించడం లేదన్నారు. రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేయాలి. రాష్ట్ర రాజధాని అమరావతి ఫ్రీ జోన్ చేసి అక్కడ భర్తీ చేసే ప్రభుత్వ ఉద్యోగాలలో 26 జిల్లాల నిరుద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని ఫ్రీ జోన్ చేయడం ద్వారానే అందరికీ లబ్ధి చేకూర్తుందని లేకపోతే వెనుకబడిన ఉత్తరాంధ్ర రాయలసీమ జిల్లాల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. గతంలో హైదరాబాద్ రాజధాని ఫ్రీ జోన్ కావడం ద్వారా అందరికీ ఉద్యోగం అవకాశాలు దొరికాయి అని తెలిపారు. ఈ మహా సభలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి, సిపిఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి గురువయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి ,జిల్లా కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులుగా జయకృష్ణ ఉపాధ్యక్షులుగా నాగరాజు భాను చంద్ర నాగార్జున జిల్లా కార్యదర్శిగా ఎం రామకృష్ణ జిల్లా సహాయ కార్యదర్శిగా మల్లికార్జున పూర్ణచంద్ర ప్రవీణ్ కుమార్ కోశాధికారి సునీల్ వీరితోపాటు 27 మందిని కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు కత్తిరవి తెలిపారు. అభినందనలతో కత్తి రవి ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు.

# గుర్రపు డెక్కను తొలగించాలని సిపిఎం డిమాండ్



**మొవ్వ, జనవరి 24, (నిఘా న్యూస్):** మొవ్వ మండలం వేములమడ గ్రామంలో పశువులకు తాగునీటికి, పరిశుభ్రం చేయటానికి ఉపయోగించే చెరువు గుర్రపు డెక్కతో ఆవరించి నీరు మొత్తం కలుషితమై ఉన్నది. ఈ గుర్రపు డెక్కను తొలగించాలని జనవరి సంక్రాంతి ముందు గ్రామ సచివాలయం నందు గ్రామ రైతాంగం సంతకాలతో కూడిన అర్జీని స్పందన కార్యక్రమంలో ఇవ్వడం జరిగింది. అధికారులు స్పందించి ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ కలుషిత నీరు పశువులు తాగటం వలన చర్మ వ్యాధులు, గర్భకోశ వ్యాధులు, లేగ దూడలకు ఒళ్లంతా పొక్కులు తదితర వ్యాధులకు గురై ఉన్నాయి. పాడి పశువులకు పాలు దిగుబడి తగ్గి రైతాంగం ఇబ్బంది పడుతున్నారు. కావున సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని యుద్ధ ప్రతిపాదికన గ్రామ చెరువులో గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని సిపిఎం మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. గ్రామంలో ఉపాధి హామీ కార్మికులు చాలా గ్రూపులు కలిగి ఉన్నారు, ఉపాధి హామీ పథకంలో ఉన్న కార్మికులకు పని కల్పించి గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు. శుక్రవారం వేములమడ గ్రామంలో గుర్రపు డెక్కతో నిండి ఉన్న చెరువును గ్రామస్తులతో సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జన్ను నాగేశ్వరావు, బొల్లా సుబ్రహ్మణ్యం, నూకల వెంకటేశ్వరరావు, రాధాకృష్ణమూర్తి, గొల్లపూడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వార్డుకు 15 లక్షలు కేటాయిస్తూ తీర్మానం

### జల్ పల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం




**పహాడీషరీఫ్, జనవరి 24 (నిఘా న్యూస్):** జల్ పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి ఈ ఐదేళ్లలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని జల్ పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది అన్నారు. జల్ పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది అధ్యక్షతన, కమిషనర్ బి. వెంకట్రామ్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం మున్సిపాలిటీ అభివృద్ధికి 4.50 కోట్లతో డ్రైనేజీ, సీసీ రోడ్లు ప్రారంభించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. ప్రతి వార్డుకు 15 లక్షల చొప్పున కేటాయించగా, ఫిబ్రవరిలో జరిగే గరిగుట్ట పెద్దమ్మ తల్లి జాతరకు రూ.3 లక్షలు కేటాయించడం జరిగిందని, అందుకుగాను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి తమకు ఎంతో సంతోషం ఇచ్చిందన్నారు. మళ్లీ ఎన్నికల తర్వాత వచ్చే చైర్మన్ మున్సిపల్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ అఫ్జల్, బుడుమాల యాదగిరి, పల్లపు శంకర్, కెంచ లక్ష్మీనారాయణ, అహ్మద్ కసాది తదితరులు పాల్గొన్నారు.

# అనర్హులను పేరి పారేస్తున్నాము: కేఎల్ఆర్

- సాగు యోగ్యమైన భూములకు రైతు భరోసా
- సంక్షేమ పథకాల అమలులో అనర్హులు ఉంటే తెలుపండి



**మహేశ్వరం, జనవరి 24 (నిఘా న్యూస్):** యోగ్యమైన భూములకు రైతు భరోసా వచ్చేలా చూడాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి రెవెన్యూ అధికారులను కోరారు. 800 ఎకరాల రావిర్యాల గ్రామ రైతులు. కిచ్చెన్నగారిని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన కె ఎల్ ఆర్ మహేశ్వరం నియోజకవర్గంలో ఏ ఒక్కరైతు నష్టపోకుండా చూడాలని కందుకూరు ఆర్డీవోను కోరారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు పేరుతో అసైన్డ్ భూములకు సైతం భరోసా తీసుకున్నారని మండిపడ్డారు. చెరువు కింద సాగు చేసుకుంటున్న పట్టా భూముల రైతులకు సైతం అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పారదర్శకంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా అర్హులందరికీ అందేలా చూస్తామని కిచ్చెన్న భరోసా ఇచ్చారు. గత బీఆర్ఎస్ పాలనలో అనర్హులను లబ్ధిదారులుగా గుర్తిస్తే, కాంగ్రెస్ ప్రజాపాలనలో ఏరి పారేస్తున్నామని, అందుకే గ్రామ సభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేసినట్లు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. దరఖాస్తుల్లో తప్పులు దొర్లినా మళ్లీ సరి చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సంక్షేమ పథకాలను పేదలందరికీ నిరంతరం అందించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తుందని కేఎల్ఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు సహా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజ బహదూర్ వెంకట రామ్ రెడ్డి విగ్రహావిష్కరణ

- వెంకట్ రామ్ రెడ్డి సేవలు నేటి యువతకు ఆదర్శం
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**మల్లాపూర్, జనవరి 24 (నిఘా న్యూస్):** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రాజ బహదూర్ వెంకట రామ్ రెడ్డి విగ్రహాన్ని శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాజ బహదూర్ వెంకట రామ్ రెడ్డి జీవితం అందరికీ ఆదర్శమని ఆయన అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన ఆయన జీవితం అందరికీ ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు నీలం రెడ్డి, సంఘం అధ్యక్షుడు కాసం రాజీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ధర్మ రెడ్డి, రవీందర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, శైలేష్ రెడ్డి రెడ్డి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తరాఖండ్ పర్యటనలో అస్వస్థతకు గురై గుండెకు శస్త్ర చికిత్స అనంతరం హైదరాబాద్ చేరుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ని ఆయన నివాసంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు.
–ఉప్పల్, జనవరి 24 (నిఘా న్యూస్):

# కార్మికులు క్షేమంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు

### పోచారం మున్సిపల్ కౌన్సిలర్ శ్రీలత రెడ్డి



**ఘట్ కేసర్, జనవరి 24 (నిఘా న్యూస్):** కార్మికులు క్షేమంగా ఉంటేనే వార్డు ప్రజలు క్షేమంగా ఉంటామని పోచారం మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ సామల శ్రీలత రెడ్డి, కౌన్సిలర్ భర్త బుచ్చిరెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో పని చేస్తున్నటువంటి 30 మంది పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం శాలువా కప్పి సన్మానం చేశారు. అదేవిధంగా వారికి నూతన దుస్తులతో పాటు నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన వార్డులో గత ఐదు సంవత్సరాలుగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిరంతరం ఉదయం 5 గంటలకే రోడ్డుపై వచ్చి పనిలో నిమగ్నమై పనిచేస్తూ, ప్రతిరోజు సహకరించిన నా సిబ్బంది క్షేమంగా ఉండాలని కోరుకుంటూ వారిని శుక్రవారం సన్మానించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు సిబ్బంది కౌన్సిలర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీలత రెడ్డి భర్త సామల బుచ్చిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమావళి పై డిగ్రీ విద్యార్థుల అవగాహన ర్యాలీ



**ఉప్పల్, జనవరి 24 (నిఘా న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉప్పల్ ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద ట్రాఫిక్ నియమాలను నినదిస్తూ అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.విజయకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.ఎ.రవికుమార్, ఎన్ ఎస్ ఎస్ పిఓ జె.విశ్వనాథ్ కుమార్ ర్యాలీలో విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఉప్పల్ ట్రాఫిక్ సి.ఐ జి.లక్ష్మీమాధవి, ట్రాఫిక్ ఎస్.ఐ.లు నరేష్, ఎస్.ఐ.రమేష్, ఎస్ ఐ నాగభూషణం, ఎ.ఎస్.ఐ భారతిలు వాలంటీర్లకు ముందుగా అవగాహన కల్పించి వారితో పాటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 30 మంది వాలంటీర్లకు మేడ్చల్ మాల్కాజిగిరి జిల్లా నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ సౌజన్యంతో టీషర్ట్స్, క్యాప్స్, డైరీలు అందించారు. జిల్లా యువజన అధికారి ఐజయ్య వాలంటీర్లకు సర్టిఫికేట్లు అందించారు. కళాశాల ఎన్ ఎస్ కమిటీ డా.ఎన్ రాజశ్రీ, డా.సిహెచ్ సత్యనారాయణ, డా. జి.తిరుపతయ్య, డా.వి.శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శివాజీ నగర్ లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

### శంకుస్థాపన చేసిన పోచారం మున్సిపల్ వైస్ చైర్మన్ రెడ్యా నాయక్



**ఘట్ కేసర్, జనవరి 24 (నిఘా న్యూస్):** సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన పోచారం మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి 14వ వార్డు శివాజీ నగర్ లో స్థానిక కౌన్సిలర్ సుర్వి రవీందర్ గౌడ్ ప్రతిపాదన మేరకు కౌన్సిల్ ఆమోదంతో ఐదు లక్షల నిధులతో తీర్మానమైన సిసి రోడ్డు పనులను శుక్రవారం కౌన్సిలర్ సుర్వి రవీందర్ ఆహ్వానం మేరకు వైస్ చైర్మన్ నవావత్ రెడ్యా నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు అయోధ్య కాలనీ వాసులు శ్రీనివాస్, ఫాతిమా బి,గోపాల్, కృష్ణారావు, ఏ భాస్కర్, నాగేంద్ర,జె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. –




జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలో ఏకశిలా ఇంటర్నేషనల్ స్కూల్ లో ఏకశిలా స్పోర్ట్స్ నిర్వహించి, చిన్నారులకు ఆట పోటీలుస్కూల్ లో పెట్టడం జరిగింది. చిన్నారులు ఆట పాటలతో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ రామాంజనేయులు స్కూల్ ఇంచార్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
–ఇటిక్యాల, జనవరి 24 (నిఘా న్యూస్):

# గౌడ కులస్తుల అభివృద్ధికి కృషి

### నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**మల్లాపూర్, జనవరి 24 (నిఘా న్యూస్):** గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ డివిజన్ లో కౌండిన్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాలెండర్ ఆవిష్కరణ, గౌడ సంఘం భవనం ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్, హెచ్ బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డికి స్వాగతం పలికిన కాంగ్రెస్ నేతలు




**ఉప్పల్, జనవరి 24 (నిఘా న్యూస్):** దావోస్ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం లభించింది. ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి, తన అనుచరులతో శంషాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనలో రూ. 1,78,950 కోట్ల పెట్టుబడులు సాధించారని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. సీఎం హెూదాలో రేవంత్ రెడ్డి విదేశీ నిధులను రాబట్టడంలో విజయవంతమయ్యారన్నారు. దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నట్టుగా చెప్పారు. దావోస్ పర్యటనతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా 49,500 ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు.

# అనుమతులు లేని మందుల షాపుపై కేసు నమోదు



**శ్రీకాళహస్తి, జనవరి 24 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు లోని అనుమతి లేకుండా ఔషధాల నిల్వ ఉంచి విక్రయిస్తున్నారని సమాచారం మేరకు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు దాడి చేసి, పరిశీలించి కేసు నమోదు చేశారు. ఔషధ నియంత్రణ శాఖ అధికారులు డ్రగ్ ఇన్స్పెక్టర్ ప్రశాంతి, రూతు, తిరుపతి ఏడి హరిప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీ జరిగింది. ఏర్పేడు సంబంధించిన టీ.జనార్ధన్ అనే వ్యక్తి అనుమతి లేకుండా మందులు విక్రయిస్తున్నారని తెలిసి ఔషధ యంత్రా అధికారులు ఆకస్మికతనిఖీచేసిసుమారు46రకాలమందులు స్వాధీనపర్చుకున్నారు. అనంతరం కోర్టుకు అప్పగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్స్పెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ అనధికారికంగా మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవు అని తెలిపారు.

# తూప్రాన్ పాలకవర్గానికి ఘన సన్మానం



**తూప్రాన్, జనవరి 24 (నిఘా న్యూస్):** తూప్రాన్ పురపాలక సంఘం పరిధిలో మొదటి పాలకవర్గ సభ్యుల పదవి కాలం అయిపోతునందున వారు పురపాలక సంఘానికి అందించిన సేవలకు గాను తూప్రాన్ పురపాలక సంఘ కార్యాలయంలో తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ పాతూరు గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ మాజీ శాసనసభ్యులు ప్రస్తుత సిద్దిపేట జిల్లా డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి హాజరైనారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ కౌన్సిలర్లు కొడిప్యాక నారాయణ గుప్తా, పల్లెర్ల జ్యోతి గుప్తా, జిన్నా భగవాన్ రెడ్డి, చింతా రవీందర్ రెడ్డి, శ్రీశైలం గౌడ్, బాణాపురం రాజు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విదేశీ పర్యటన దిగ్విజయంగా పూర్తి చేసుకొని హైదరాబాద్ తిరిగి వచ్చిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన పీసీసీ కార్యదర్శి యెల్మేటీ అమరేందర్ రెడ్డి.

*–బాలాపూర్, జనవరి 24 (నిఘా న్యూస్):*

## షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం



**మేడ్చల్, జనవరి 24 (నిఘా న్యూస్):** మేడ్చల్ మండలంలో వరుస అగ్ని ప్రమాదాలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా రెండు రోజుల వ్యవధిలో మేడ్చల్, కిష్టాపూర్ లో అగ్ని ప్రమాదాలు జరిగి భారీ ఆస్తి నష్టం జరిగింది. మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని నాల్గవ వార్డులో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. తుడుం నాగరాజు అనే వ్యక్తికి చెందిన ఇంట్లో ఎవరు లేని సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మంటలు చెలరేగాయని, క్షణాల్లోనే మంటలు ఇల్లంతా వ్యాపించడంతో ఇంట్లో ఉన్న వస్తువులన్ని పూర్తిగా దగ్ధమయ్యాయని నాగరాజు తెలిపాడు. అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో అల్మారిలో ఉన్న రూ. 40వేల నగదు, బట్టలు, రిఫ్రిజిరేటర్, ఫ్యాన్ లతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

## డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవం



**ఉప్పల్, జనవరి 24 (నిఘా న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉప్పల్ లో మహిళా సాధికారత విభాగం డబ్ల్యూ ఈసీ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం జరిగింది. సభాధ్యక్షులు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.విజయకుమార్ మాట్లాడుతూ కేవలం విద్య, ఉద్యోగాల ద్వారా మాత్రమే బాలికా సాధికారత సాధ్యమని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎ.రవిప్రసాద్, డబ్ల్యూ ఈ సి సమన్వయ కర్త డా.ఎన్.రాజశ్రీ, అకడమిక్ కో ఆర్డినేటర్ కె.గీత, ఎన్ఎస్ఎస్ పిఓ జె.విశ్వనాథ్ కుమార్, డా.ఎస్ యమున, జి.శ్రీదేవి, పి.ధనలక్ష్మి, డా.వి.చంద్రకళ, ఎస్.మమత, భాగ్యలత తదితరులు పాల్గొన్నారు.

## సీక సాయి ఫౌండేషన్ ద్వారా పేదలకు నగదు సాయం



**అబ్దుల్లాపూర్ మెట్, జనవరి 24 (నిఘా న్యూస్):** అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని లష్కర్ గూడ గ్రామ మాజీ ఎంపిటీసీ సీక సాయికుమార్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం సీక సాయి ఫౌండేషన్ ద్వారా గ్రామంలోని ఆరోగ్య సమస్యలతో భాద పడుతున్న పలు కుటుంబాలకు రూ.45 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆలేటి ఆశ్రమంలో అనాధలకు పండ్లు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు అల్లి మల్లేష్ యాదవ్, మాజీ వార్డ్ సభ్యులు అల్లి కృష్ణ యాదవ్,ఇరుగు జంగం, హుసేన్, హమీద్ ,శ్రీకంత్ కరిమెల, రవి గంగని, లింగం ఆర్ కె,శ్రీకంత్ దుసరి శేఖర్, భాస్కర్ రెడ్డి, రాజు యాదవ్, బగత్,జగన్, మహేందర్ శంకర్ బన్నీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో నిరంతరం కుతాడి సేవలు



**తూప్రాన్, జనవరి 24 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని యావపూర్ గ్రామంలో గత కొంతకాలంగా గ్రామ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని గ్రామ అభివృద్ధి కోసం పాటుపడుతూ స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది, యావపూర్ గ్రామ నివాసి కుతాడి నర్సింలు అదే గ్రామంలో ఉన్న అంగన్వాడీ 1లో విద్యుత్తు కనెక్షన్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పడంతో వాటికి కావలసిన సామాగ్రిని అందజేశారు. అంతేకాకుండా గతంలో దేవాలయాల వద్ద తన సొంత నిధులతో నీటి వనరులను సమకూర్చే విధంగా బోర్లు వేయించాడు. గ్రామంలో ఎలాంటి అసౌకర్యం ఉన్నా నేను ముందున్నా నంటూ గ్రామ యువకులకు వివరించారు. ఇదే కోణంలో గ్రామ అభివృద్ధిలో తన వంతు పాత్ర ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# తెలంగాణ వీరత్వానికి.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీక

- ఫోటో రైట్ అప్ సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి అందెల శ్రీరాములు యాదవ్ బహు పరాక్రమవంతుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- డబిల్ గూడలో పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణలో ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, అందెల శ్రీరాములు



**మహేశ్వరం, జనవరి 24 (నిఘా న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం డబిల్ గూడ గ్రామంలోని గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ మహోత్సవంలో ముఖ్య అతిథులుగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్ తో కలిసి పాల్గొని పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆనాటి మొగల్ పాలకుల దౌర్జన్యాలకు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తిరుగుబాటు చేసి గోల్కొండ కోటను పాలించిన పరాక్రమవంతుడని గుర్తు చేశారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ తెలంగాణ వీరత్వానికి పరాక్రమానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీక అని సబ్బండ వర్గాలకు ఆత్మగౌరవ స్ఫూర్తిగా నిలిచిన గొప్ప వీరుడని కొనియాడారు. వారి కీర్తి ప్రతిష్టలు గూర్చి నేటి తరం సమాజానికి తెలియపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఆనాటి వీరుల పోరాట స్ఫూర్తితో సమసమాజ స్థాపనకు అందరం కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా నాయకులు బస్వ పాపయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, మహేశ్వరం మండల్ మాజీ ఎంపీపీ కుండే వెంకటేష్, బిజెపి మండల్ అధ్యక్షులు టీ యాదీష్, డబిల్ గూడ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ సర్పంచ్ రఘుపతి గౌడ్ జిల్లా బీజేవైఎం నాయకులు రఘు గౌడ్, గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు అల్వాల చంద్రశేఖర్ గౌడ్, ఉపాధ్యక్షులు అల్వాల కుమార్ గౌడ్, యువజన సంఘం అధ్యక్షులు అల్వాల అఖిల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ గౌడ్, బిజెపి, బీజేవైఎం నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో సకల సౌకర్యాలు

- ప్రైవేటు ఆసుపత్రులకెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దు
- సీనియర్ రీజినల్ డైరెక్టర్.డా.అనురాధ



**వికారాబాద్, జనవరి 24 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఆసుపత్రి స్థాయిని బట్టి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ వెల్లడించారు. భారత ప్రభుత్వ కుటుంబ సంక్షేమ శాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభాగం సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ పర్యవేక్షణలో భాగంగా జిల్లా పరిధిలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలవుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలవుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు, నవజాత శిశువుకు, చిన్నారులకు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సంబంధిత డాక్టర్ల ఆధ్వర్యంలో వ్యాధి లక్షణాలు ఉన్నవారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించి, మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు సందర్శించి సంబంధిత డాక్టర్లను సంప్రదించి డాక్టర్ల సూచనల మేరకు వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. మూడు రోజుల పర్యవేక్షణ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణకు, జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవీందర్ యాదవ్ కు, జిల్లా ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ వై.పవిత్ర కు, సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# గుండ్ల పోచంపల్లిలో అభివృద్ధి పనులు ప్రారంభం



**హాజరైన ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం, జంగయ్య యాదవ్**

మేడ్చల్ జనవరి 24(నిఘా న్యూస్): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డ్ లలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన మరియు ప్రారంభోత్సవ కార్యక్రమమంలో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గ్రామసభల ద్వారా అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా సంక్షేమ పథకాలకు దరఖాస్తుల స్వీకరిస్తున్నామని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినిగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర జంగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ మోహన్ రెడ్డి, గుండ్ల పోచంపల్లి కౌన్సిలర్లు, కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి పేట శ్రీనివాస్ మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షురాలు శైలజ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# దుమ్ము ధూళితో అనారోగ్య సమస్యలు

**ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్.నాజియా నౌషీన్ సిద్దిఖా**



**హైదరాబాద్, జనవరి 24 (నిఘా న్యూస్):** దుమ్ము ధూళికి ప్రజలు దూరంగా ఉండటమే ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాజియా నౌషీన్ సిద్దిఖా వెల్లడించారు. నగరంలోని నాంపల్లి ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాజియా నౌషీన్ సిద్దిఖా మాట్లాడుతూ చలి వాతావరణం ఇంకా కొనసాగుతుంది. కావున చలిలో బ్యాక్టీరియా వైరస్ లు మరింత బలపడుతుంటాయని, శరీరంలో రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారిలో ఇవి ఇబ్బందులు కలిగిస్తాయని స్పష్టం చేశారు. దుమ్ము ధూళి పొగ కారణాల వలన తదితర చర్మ వ్యాధులు సంక్రమించడానికి ఆస్కారం ఉందని తెలిపారు. దుమ్ము ధూళి శరీరంపై ప్రభావం చూపుతుందనే విషయాన్ని ప్రజలు విస్మరించకూడదని గుర్తు చేశారు. సాధ్యమైనంతవరకు దుమ్ము ధూళికి, దూరంగా ఉండడం, చలి వాతావరణంలో అధిక సమయం ఉండకుండా చూసుకోవాలని సూచించారు. దుమ్ము ఎలర్జీ, ముక్కు కారటం, ముక్కు బిగుసుకుపోవడం, తలనొప్పి, చెవి నొప్పి, గొంతు బొంగురు పోవడం, శ్వాసకోశ సమస్యలు, తదితర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్లను సంప్రదించడం ఉత్తమం అన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండడానికి ప్రజలు కృషి చేయాలని కోరారు. ఆరోగ్య సూత్రాలు పాటించి, ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కలుషిత వాతావరణంలో అధిక సమయం గడపకూడదని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో, అనివార్య కారణాల వలన కలుషిత వాతావరణంలో వెళ్లవలసి వస్తే వీలైనంత త్వరితగతిన, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం శ్రేయస్కరమని హితవు పలికారు. గణతంత్ర పర్వదినం పురస్కరించుకుని ముందస్తుగా ఆసుపత్రి డాక్టర్లకు, వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం రోజున ఆసుపత్రికి సకాలంలో రావాలని ఆసుపత్రి డాక్టర్లకు సిబ్బందికి సూచించారు.

# గన్నవరంలో ప్రారంభమైన సబ్ జోన్ క్రీడలు



**గన్నవరం, జనవరి 24 (నిఘా న్యూస్):** గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో శుక్రవారం బాలుర సబ్ జోన్ క్రీడలు ఉత్సాహంగా ప్రారంభమైనాయి. ఈ ఆటల పోటీలను సీనియర్ ఖో ఖో కోర్ట్ ను బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు గొట్టం వెంకట రవి బాబు ప్రారంభించగా, వాలీబాల్ కోర్ట్ ను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే.వి.ఆర్ కిషోర్ ప్రారంభించారు. ఎనిమిది క్రీడాంశాలకు సంబంధించి గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల నుండి సుమారు గా 350 మంది బాలురు ఈ పోటీలలో పాల్గొన్నారు. శనివారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతాయని కృష్ణా జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి సి.హెచ్.చంద్రశేరరావు తెలిపారు. ఈ ఆటల పోటీలలో సంఘం అధ్యక్షులు పి.వెంకటేశ్వరావు, ఉపాధ్యక్షులు బి.యస్.రామ చంద్రుడు, సబ్ జోన్ కార్యదర్శి యస్.వెంకటేశ్వరావు, సలహాదారుడు యస్.సుబ్బారావు, గన్నవరం వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు షేక్ మీరా సాహెబ్ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు కృష్ణ ప్రియ, హరి నారాయణ రామారావు, బాల కృష్ణ సుబ్బారావు, టాన్య గిరి, గీత, శాంతి, శ్రీదేవి లక్ష్మణరావు సుజాత, విజయ కుమారి, తదితరులు హాజరైనారు.

## తూప్రాన్ లో గాంధీ విగ్రహావిష్కరణ

**హాజరైన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మామిండ్ల జ్యోతి**



**తూప్రాన్, జనవరి 24 (నిఘా న్యూస్):** తూప్రాన్ మున్సిపల్ లోని జండా వద్ద మహాత్మ గాంధీ విగ్రహా ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ ఎంఎల్ఏ నర్సరెడ్డి హాజరై ప్రారంభించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి గౌరవ వందనం చేశారు, వీరితోపాటు మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, పల్లెర్ల రవీంద్ర గుప్త, రవీందర్ రెడ్డి, నారాయణ గుప్తా, శ్రీశైలం గౌడ్, సీనియర్ నాయకులు మామిండ్ల కృష్ణ, నేత మహేందర్ రెడ్డి, వేమారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి రెడ్డి, తలారి మల్లేష్, సత్యలింగం, పాల్గొని పూల మాలలు వేశారు, ఇందులో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయ వంతం చేశారు.

## కార్మికులకు యూనిఫామ్ అందజేసిన చైర్మన్ కొండల్ రెడ్డి



**ఘట్ కేసర్, జనవరి 24 (నిఘా న్యూస్):** మున్సిపల్ కార్మికులకు మున్సిపల్ మునోగ్రామ్ తో నూతన దుస్తులను అందించిన చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. పోచారం మున్సిపాలిటీలోని విలీనమైనటువంటి ఐదు గ్రామాలు కొర్రముల్ల, ప్రతాప్ సింగారం, కాచివాల్ సింగారం, చౌదరిగుడా, వెంకటాపురం గ్రామ పంచాయతీల సిబ్బందికి గ్రామపంచాయతీ మనోగ్రంతో ఉన్న యూనిఫాం ఉండడంతో అందరికీ ఒకే మున్సిపల్ యూనిఫామ్ ఉండాలని చైర్మన్ సొంత నిధులతో 210 మంది కార్మికులకు శుక్రవారం ఆయా గ్రామాలకు వెళ్లి నూతన దుస్తులను కమిషనర్ వీరారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ మహిపాల్, సానిటరీ ఇన్స్పెక్టర్ వాణి, నాయకులు వాకిటి బాల్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది సాయి తేజ, పీ.ఎ.మహేష్ యాదవ్, సూపర్వైజర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు డిబిఎఫ్ రాజ్యాంగ పరిరక్షణ సదస్సు

**దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పిలుపు**



**వరంగల్, జనవరి 24 (నిఘా న్యూస్):** వరంగల్ లో నేటి శనివారం ఎర్రగుట్ట పంక్షన్ హల్ లో జరిగే రాజ్యాంగ పరిరక్షణ రాష్ట్ర సదస్సుకు ప్రతి ఒక్కరు తరలి రావాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పిలుపు నిచ్చారు. హన్మకొండలో శుక్రవారం శంకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ 75 ఏళ్ళ ఉత్సవాలలో భాగంగా డిబిఎఫ్ భారత రాజ్యాంగ దినోత్సవం నవంబర్ 26 నుండి జనవరి 26 గణతంత్ర దినోత్సవం వరకు రాష్ట్ర వ్యాప్తంగా భారత రాజ్యాంగ విలువల ప్రచారొద్యమాన్ని చెపట్టమన్నారు.కొట్లాది మంది అణగారిన వర్గాల జీవితాలలో వెలుగులు నింపిన రాజ్యాంగ ఉత్సవాలను జరుపుకొవాల్సిన అవసరం ఎంతో వుదన్నారు.ఈ భారత రాజ్యాంగ పరిరక్షణ రాష్ట్ర సదస్సుకు ఆధిదులుగా వరంగల్ ఎంపి కడియం కావ్య,రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్యేలు నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ బాస్కర్, డిబిఎఫ్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, ప్రొఫెసర్ రమ,ఎర్రగట్టు స్వామి తదితరులు హజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సప్పగూడలో యువకుడి ఆత్మహత్య

**నూతనంగా నిర్మించుకున్న ఇల్లు ఖాళీ చేయాలని వేధించారని మృతుడి భార్య ఫిర్యాదు**



**నందిగామ, జనవరి 24 (నిఘా న్యూస్):** ఊరి వేసుకొని యువకుడు మృతి మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. నందిగామ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నర్సప్పగూడ గ్రామానికి చెందిన అంకం కుమార్ (30) వ్యవసాయం చేసుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. తను ఈ మధ్యకాలంలో నూతనంగా ఇల్లు నిర్మించుకున్నాడు. కాగా ప్రస్తుతం మీరు ఉంటున్న ఈ ఇల్లు మీది కాదని నర్సప్పగుడ గ్రామానికి చెందిన మంగలి నందమయ్య రాజు రవి కుమార్ లింగం అనిల్ పలుమార్లు ఇల్లు విడిచి వెళ్లాలని నా భర్త అంకం కుమార్ ను వేధించారు. మంగలి నందమయ్య వారి కుటుంబ సభ్యులు వేధింపులు భరించలేక నా భర్త గురువారం అర్థ రాత్రి ఎవరు లేని సమయం లో ఇంట్లో ఫ్యాన్ కి ఊరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. నా భర్త మృతికి కారణమైన వ్యక్తులను విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుమార్ భార్య తేజస్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు సిఐ ప్రసాద్ తెలిపారు.

## మత్స్యకారుడి మృతికి ఎమ్మెల్యే నివాళులు



**పెబ్బేరు, జనవరి 24 (నిఘా న్యూస్):** వనపర్తి పట్టణం 6వ వార్డుకు చెందిన మత్స్యకారుడు వెంకటేష్ శుక్రవారం సమీపంలోని కుంటలోకి చేపల వేటకు వెళ్లి మృతి చెందడంతో విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి జిల్లా ఆసుపత్రి మార్చురీలో గల మృతుడు వెంకటేష్ మృతదేహం వద్ద నివాళు లర్పించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా యువకుడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సహకరణ అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కార్యక్రమంలో వనపర్తి పట్టణ నాయకులు,కార్యకర్తలు,కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్వర్తి పంచాయతీకి కంప్యూటర్ బహుకరణ




**వలిగొండ, జనవరి 24 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెల్వర్తి గ్రామానికి చెందిన అమెరికాలో స్థిరపడిన శీలోజు దుర్గాప్రసాద్-కవిత 63,000 వేల విలువగల కంప్యూటర్, ప్రింటర్ లను శీలోజు ఆంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామపంచాయతీ కి ఎంపీడీవో జితేందర్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ వీసం నరేందర్ లకు అందజేశారు. ఆంజనేయులును ఎంపీడీవో, సెక్రెటరీ లు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి కంప్యూటర్ సౌకర్యం లేని విషయాన్ని, దుర్గాప్రసాద్ కు సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి ఈ కంప్యూటర్ ను బహుకరించారని తెలియజేశారు.

## మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల అడ్మిషన్లు ప్రారంభం



**భువనగిరి, జనవరి 24 (నిఘా న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాల అండ్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు జరుగుచున్నయని పాఠశాల ప్రిన్సిపాల్ గంద్ర శ్రీకాంత్ ప్రిన్సిపాల్ తెలిపారు. అడ్మిషన్లలో భాగంగా శు క్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోతుకుంట గ్రామంలోని మైనార్టీ విద్యార్థుల ఇంటి దగ్గరికి వెళ్లి వారి ఆధార్ కార్డు ఫోటో బోనఫైడ్ తీసుకొని ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది. యాదాద్రి భువనగిరి జిల్లా మైనార్టీ పిల్లలు 5వ తరగతి నుండి 8వ తరగతి వరకు అడ్మిషన్లు కలవు వీటిని ఆన్లైన్లో కూడా అప్లై చేసుకోగలరని ఆ స్కూలు ఇంగ్లీష్ ఉపాధ్యాయులు అంతటి బాలరాజ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ కొండాపురం శ్రీనివాస్ ఈ అవకాశం వినియోగించుకోవాలని జిల్లా ప్రజలను కోరడం జరిగింది.


## ఈ నెల 16న టైలరింగ్ ట్రైని శైలజ మిస్సింగ్



**హయత్ నగర్, జనవరి 24 (నిఘా న్యూస్):** గత కొంతకాలంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హత్యలు ఆత్మహత్యలు ప్రేమ వ్యవహారాల్లో మోసాలు గొడవలు విపరీతంగా వెలుగు చూస్తున్న వైనం. ప్రధానంగా ప్రేమ వ్యవహారాలే ఇలాంటి వ్యవహారాలకు కారణమవుతున్నాయి అనడంలో సందేహం లేదనే వాదన వినిపిస్తోంది. హయత్ నగర్ ప్రాంతంలోని ఎల్లారెడ్డి కాలనీలో ఈ నెల 16న ఈ సంఘటన చోటుచేసుకుందని తెలిపిన హయత్ నగర్ పోలీసులు. జనవరి 24న హయత్ పోలీసులకు ఆలస్యంగా ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టైలరింగ్ శిక్షణ కొరకు వెళ్లి వస్తానని 11 గంటలకు ఇంటి నుండి వెళ్లిన ఉడుగు శైలజ (శైలు), శైలు అలియాస్ శైలజ టైలరింగ్ వృత్తి శిక్షణ కేంద్రానికి రోజులాగే వెళ్లి తిరిగి వస్తుందనుకున్నా ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధుమిత్రులు ఇళ్లల్లో పలు కాలనీలలో వెతికినా ఆచూకీ లభించలేదని తెలిపిన తండ్రి మల్సూర్ హయత్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. హయత్ నగర్ స్టేషన్ హౌస్ అధికారి పర్యవేక్షణలో మిస్సింగ్ కేసును పరిశీలిస్తున్నామని త్వరలోనే ఆచూకీ కనుగొంటామని తెలిపిన ఎస్సై లింగారెడ్డి తెలిపారు.

## శివరాత్రి ఏర్పాట్లను ముమ్మరం చేయండి

### శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



**శ్రీశైలం, జనవరి 24 (నిఘా న్యూస్):** శ్రీశైలం మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ముమ్మరంగా చేపట్టాలని దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఈవో శ్రీనివాసరావు అధికారులు, ఇంజనీర్లతో కలిసి పాతాళగంగస్నాన ఘాట్లు, డార్మెంటరీలు, కళ్యాణ కట్ట, మల్లికార్జున సదన్ సిద్ధ రామప్ప కాంప్లెక్స్ పైన ఉన్న సూట్ రూములను పరిశీలించారు. పాతాళ గంగ స్నాన ఘట్టాల బార్కెట్లను పటిష్టంగా నిర్మించాలని సూచించారు, స్నాన ఘాట్ల వద్ద అవసరమైన విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. శివదీక్ష శిబిరాల్లో కూడా భక్తులకు తగినన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

# ఛలో ఢిల్లీని విజయవంతం చేయాలి

### బిసి విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల



**భువనగిరి, జనవరి 24 (నిఘా న్యూస్):** బిసి సంక్షేమం కోరుతూ ఫిబ్రవరి 6,7న జరగబోయే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భువనగిరి పట్టణ కేంద్రంలో విద్యార్థులతో కలిసి కరపత్రం ఆవిష్కరించారు. బిసి విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్ మాట్లాడుతూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద ధర్నా జాతీయ సెమినార్లు కార్యక్రమానికి తరలి రావాలని అన్నారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అలాగే ఎస్సీ, ఎస్టి, బీసీ జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేయాలని కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని జనాభా గణనలో బీసీ కుల గణన చేయాలని బడ్జెట్లో విద్యార్థులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని దేశంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని గవర్నమెంట్ సంస్థ ప్రైవేటీకరణ నిషేధించాలని బీసీ క్రిమిలేయర్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని మెస్ చార్జీలు మూడు వేలకు పెంచాలని బీసీల కోసం ఢిల్లీలో ధర్నా చేస్తాం బీసీ బిల్లుకు మద్దతు అని చెప్పి ఇంతవరకు దాని ఊసే లేదు బీసీ బిల్లుకు మద్దతు తెలపకపోతే రాష్ట్ర ప్రభుత్వాని గద్దె దింపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు వేముల అనిల్ కుమార్, శరత్ యాదవ్, వట్టెం మధు, మహేష్,ఎలేష, రాజు గౌడ్, భాస్కర్, చంటి ముదిరాజ్, విజయ్ కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘర్షణ వాతావరణంలో గ్రామసభ



**వలిగొండ, జనవరి 24 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ప్రజా పాలనలో భాగంగా వెల్వర్తి గ్రామంలో వలిగొండ మండల ఎంపీడీవో జితేందర్ రెడ్డి అధ్యక్షతన మండల ప్రత్యేక అధికారి జగన్నాథ రావు సమక్షంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా లకు సంబంధించిన దరఖాస్తుదారుల పేర్లు చదివి వినిపించారు. లిస్టులో పేర్లు లేని వారు అధికారులపై ఆందోళనకు దిగగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ముఖ్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని మహిళలు అధికారులను డిమాండ్ చేశారు. అనంతరం అధికారులు చొరవ చేసుకొని ఎవరైనా దరఖాస్తు చేసుకోనివారు, పేర్లు రానివారు ఉంటే వారికి గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ వి. నరేందర్, వ్యవసాయ శాఖ ఏఈఓ సాయి, ఈసీ విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ సుకీర్తి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు ఉక్కుర్తి స్వామి, మాజీ సర్పంచులు బతేపు అంజయ్య, మల్లం శ్రీనివాస్, పసల అన్నమేరి శౌరి, మాజీ ఎంపిటిసి లు గుండు శేఖర్, ఎడవెల్లి సత్తమ్మ యాదయ్య, గ్రామ సీనియర్ నాయకులు కలుకూరి రాములు, చెవ్వ వెంకటేశం, బూడిది పాపయ్య, కలుకూరి చంద్రయ్య, నానమాల ఉప్పలయ్య, నాగిళ్ల యాదగిరి, మల్లం నరేష్, కూచిమల్ల నాగేష్, బైరు సైదులు, పిట్టల గణేష్, ఎడవల్లి నరసింహ, ఆశ వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ప్లేస్మెంట్స్

### నియామక పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే గూడెం




**పటాన్చెరు, జనవరి 24 (నిఘా న్యూస్):** విద్యార్థి దశనుండే మానసిక ధైర్యం పెంపొందించు కోవాలని, ప్రతి ఓటమి విజయానికి తొలిమెట్టు లాంటిదని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన క్యాంపస్ ప్లేస్మెంట్స్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పటాన్చెరులో నిరుపేద మధ్యతరగతి ప్రజల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడంలో భాగంగా కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు క్యాంపస్ ప్లేస్మెంట్స్ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదగ్గ పరిణామం అన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుంటూ ముందుకు వెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా జస్ట్ డయల్,. పేటీఎం, టెక్ మహీంద్రా సంస్థలు నిర్వహించిన ఇంటర్వ్యూలో డిగ్రీ కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ఉద్యోగాలు సంపాదించారు. వీరందరికి ఎమ్మెల్యే జీఎంఆర్ నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వద్లూరి శ్రీనివాస్, ప్రవీణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఏ.రంగంపేటలో సస్య రక్షణపై రైతులకు శిక్షణ



**చంద్రగిరి, జనవరి 24 (నిఘా న్యూస్):** చంద్రగిరి మండలం ఏ.రంగంపేట గ్రామంలో మామిడిలో పూత,పిందె దశలో చేపట్టవలసిన సస్య రక్షణ పద్ధతుల పైన రైతులకు శిక్షణా కార్యక్రమం ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బిదశరథ రామిరెడ్డి విచ్చేసినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడిలో డిసెంబర్, జనవరి మాసాలలో కురిసిన వర్షాలు, రాత్రి,పగటి ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం పూత రావడానికి అనుకూలంగా లేకపోవడం,సరైన యాజమాన్య పాటించక పోవడం,ఎరువులు సరైన మోతాదులలో చెట్లకు అందించక పోవడం అని తెలిపారు. రైతులు 13:0:45(మల్టి-కె)-10 గ్రా.ఫార్ములా4సూక్ష్మ దాతు మూలకాల మిశ్రమం2 గ్రా.క్లోరోపైరిఫాస్ 50శాతం ఈసి-టు ఎమ్ ఎల్,ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం వలన నిద్రావస్థలో ఉన్న మొగ్గ,పూ మొగ్గగా మారే అవకాశం ఎక్కువ శాతం ఉంటుందని తెలిపారు.పూత వచ్చిన తోటలలో పూతను తేనె మంచు పురుగు,అంత్రక్నోస్ తెగుల్లు ఆశించకుండా నివారణకు పచ్చిపూత దశలో బుప్రొఫెజిన్ 20 శాతంఎసిఫేట్ 50శాతం కాంబినేషన్ లో లభ్యమయ్యే పురుగు మందు1గ్రా, మాంకోజెబ్ 63శాతం కార్బెండజమ్ 12శాతం కాంబినేషన్ లో లభ్యమయ్యే తెగులు మందు1.5గ్రా.ఫార్ములా4-2గ్రా.గమ్0.5మి.లీ.ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. రైతులు సంఘాలుగా ఏర్పడటం వలన మధ్య దళారుల ప్రమేయం లేకుండా సంఘం ద్వారా మార్కెట్ లో అన్ని రకాల ఉద్యాన పంటలను మంచి ధరలకు అమ్ముకోవచ్చుని,మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఆమ్చుర్, మామిడి తాండ్ర,మామిడి ఒరుగులు,ఊరగాయలు వంటి వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేసి మార్కెటింగ్ చేసుకోవచ్చుని,కలెక్షన్ సెంటర్లను నిర్మించి మామిడి కాయలను వాషింగ్,గ్రేడింగ్, ప్యాకింగ్ చేసి అధిక ధరకు అమ్ముకోవచ్చని రైతులకు రైతు సంఘాల ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎ.రంగంపేట సర్పంచ్,డ్రిప్ మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్,గ్రామ ఉద్యాన సహాయకురాలు, రైతులు పాల్గొన్నారు.

# రైతు,కార్మిక విధానాలకు.. నిరసనగా జనవరి 26న బైక్ ర్యాలీ




**శ్రీకాకుళం, జనవరి 24 (నిఘా న్యూస్):** కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా శ్రీకాకుళంలో జనవరి26న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా,కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. శ్రీకాకుళం సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పదమూడు నెలలు పాటు సాగిన రైతు ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలివేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. రైతు ఉద్యమానికి తలవంచి రద్దు చేసిన చట్టాలలోని విధానాలతోనే తిరిగి కొత్త చట్టాలుగా తీసుకువస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన సహకార చట్టం, వ్యవసాయ సాంకేతిక చట్టం రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల పెత్తనం క్రిందకు తెచ్చేందుకు చేసినవే అని దుయ్యబట్టారు.సహకార చట్టంలో చేసిన మార్పుల వల్ల సహకార పరపతి సంఘాలు, పాడి సహకార సంఘాలు, మత్స్య సహకార సంఘాలను కార్పొరేట్ కంపెనీల గొడుగు క్రిందకు చేర్చడమే లక్ష్యంగా ఉన్నాయని అన్నారు. రైతులు,వ్యవసాయ కార్మికులు,కౌలు రైతులు, ఉద్యోగులు కార్మికులు శ్రీకాకుళం 7 రోడ్ల జంక్షన్ నుండి సూర్యమహల్ మీదగా రామలక్ష్మణ జంక్షన్ వరకు జరుగు మోటార్ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు,సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు, ఎఐటియుసి జిల్లా గౌరవ సలహాదారులు చిక్కాల గోవిందరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సీపాన.వెంకట్రావు,సిఐటియు నాయకులు ఎ.సత్యం, ఆర్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

## అధునాతన ఎక్స్ రే ప్లాంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే

### ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలకు త్వరలో పరిష్కారం: నల్లమిల్లి



**అనపర్తి, జనవరి 24 (నిఘా న్యూస్):** అనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన 300 ఎంఏ డిజిటల్ ఎక్స్ రే ప్లాంట్, 3 కంప్యూటర్స్ ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం అనపర్తి ఏరియా హాస్పిటల్ లో హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులుగా నియమితులైన సందర్భంగా మేడపాటి సత్యనారాయణ రెడ్డి అన్నవరంను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. సొసైటీ సభ్యులతో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ కి సంబంధించి మౌళిక సదుపాయాలు, వైద్యులు,స్టాఫ్, సెక్యూరిటీ,శానిటేషన్ సంబంధించి కొన్ని సమస్యలు దృష్టికి తీసుకురావడం జరిగిం. త్వరలో సమస్యలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం




**బిక్కవోలు, జనవరి 24 (నిఘా న్యూస్):** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం ఊలపల్లి గ్రామంలో తొండాపు సురేష్ కుమార్ రెడ్డి, కాకర్ల అశోక్,బొడ్డు అర్జున్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 20 వ తేదీ నుండి. 31 వ తేదీ వరకు ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఊలపల్లి గ్రామంలో జరిగిన శిబిరానికి సుమారు 60 మంది పాడి రైతులు తమ పశు వులను తీసుకుని వచ్చారని వాటికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇవ్వడం జరిగిందని కావలసిన మందులు కూడా పంపిణీ చేయడం జరిగిందని సుమారు 120 పశు వులకు చికిత్స అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్పెషల్ ఆఫీసర్ డా.కె.రాధాకృష్ణ మూర్తి డిప్యూటీ డైరెక్టరు డా.మక్కెన వెంకటేశ్వరరావు, అనపర్తి సహాయ సంచాలకులు డా.ఎట్క.శ్రీమవాసరావు మండల పశు వైద్యాధికారి డాక్టర్ డి.వి.ప్రణీత్, డాక్టర్.రవి కుమార్, డా.వీర్రాజు, జి.వి.ఒ.సూర్యకుమారి సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాలేరు



**అంబర్ పేట, జనవరి 24 (నిఘా న్యూస్):** గోల్నాక డివిజన్ శాంతినగర్ కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర 2025 క్యాలెండర్ ను అంబర్ పేట శాసనసభ్యుడు కాలేరు వెంకటేష్ శుక్రవారం ఆవిష్కరించారు.గోల్నాకతులసి నగర్లోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ నాయకులు ఆర్.కె.బాబు, బి.లింగంగౌడ్, బుచ్చిరెడ్డి, పులిజాల గెల్వయ్య, భూపతి లక్ష్మణ్, ఆర్.రాము, మల్లేశం, నర్సింగ్ యాదవ్ అంజయ్యచారి, ప్రభాకర్, బోదాసు శేఖర్, నవీన్ యాదవ్ లు పాల్గొన్నారు.

## వాహనాలకు రేడియం స్టిక్కర్లు అంటించిన పోలీసులు



**దమ్మపేట, జనవరి 24 (నిఘా న్యూస్):** దమ్మపేట పోలీస్ ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డు భద్రతా మాస ఉత్సవాల సందర్భంగా ట్రాక్టర్ ట్రక్కుల వెనకాల భాగంలో రేడియం స్టిక్కర్లు అంటించి రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఈ కార్యక్రమం నివారించడం జరిగిందని ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపారు. అలాగే ట్రాక్టర్ డ్రైవర్లు ప్రతి ఒక్కరు కూడా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అలాగే వెహికల్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట పోలీస్ సిబ్బందిలు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి



**తాండూరు, జనవరి 24 (నిఘా న్యూస్):** ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి వెల్లడించారు. బషీరాబాద్ మండల పరిధిలోని కొర్విచేడ్ గ్రామంలో ప్రజా పాలనలో భాగంగా గ్రామసభ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం లోనే గ్రామాలు అన్ని విధాల అభివృద్ధి చెందుతాయని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే తాండూరు నియోజకవర్గంలోని నలుదిక్కులలో రహదారుల నిర్మాణం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వై. వెంకటేష్, సొసైటీ చైర్మన్ వెంకట రాంరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి రాకేష్ మహారాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కలాల్ నర్సింలు గౌడ్, మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అభయ పథకం లబ్ధిదారుడికి చెక్కు పంపిణి



**బెల్లంకొండ, జనవరి 24 (నిఘా న్యూస్):** వడ్లమూడి సంగం డైరీ వ్యవస్థాపకులు ధూళిపాళ్ల వీరయ్య చౌదరి 31 వ వర్ధంతి సందర్భంగా సంఘం డైరీ ధూళిపాళ్ల వీరయ్య చౌదరి సంఘం డైరీ వారి అభయ పథకం ద్వారా లబ్ధిదారులు బెల్లంకొండ గ్రామం సంఘం డైరీ వారి పాల సేకరణ కేంద్రం, సంఘం డైరీ సభ్యుడు సాపవత్ రాములు నాయక్ కి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి అభయ పథకం ద్వారా సాపవత్ రాములు నాయక్ నమోదు చేసుకోవడం జరిగింది. ధూళిపాళ్ల వీరయ్య చౌదరి అభయ పథకం ద్వారా లబ్ధిదారునికి సంఘం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, లబ్ధిదారుని కి 60 వేల రూపాయలు చెక్కు అందించారు. డైరెక్టర్ ధర్మారావు శేషగిరి కుమారి గంగిరెడ్డిపాలెం సంఘం డైరీ ఇంచార్జ్ కె శ్రీనివాస్ సూపర్వైజర్ సుధీర్ బెల్లంకొండ వెండర్ పాయింట్ అధ్యక్షుడు వెన్న సీతారామరెడ్డి ఆ కుటుంబ సభ్యులకి చెక్కు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మోడల్ పాఠశాలల ఏర్పాటు పటిష్టంగా జరగాలి

### ఎంఈవోలతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే



**పలమనేరు, జనవరి 24 (నిఘా న్యూస్):** నూతన విద్యా విధానం ప్రకారం విద్యార్థుల సంఖ్యాధారంగా చేపట్టనున్న మోడల్ పాఠశాలల ఏర్పాటు పటిష్టంగా జరగాలని ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త విధానం పై నియోజకవర్గంలోని ఎంఈఓ లతో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య, హాజరు శాతంతో పాటు మోడల్ పాఠశాలల ఏర్పాటుకు అవకాశం ఉన్న పాఠశాలల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం, తల్లి దండ్రుల నుంచి వ్యతిరేకత రాకుండా ప్రక్రియ జరగాలని, అధికారులు ఇష్టానుసారం చేపడితే డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉంటుందని కాబట్టి పటిష్టంగా నిర్వహించాలని ఆయన సూచించారు. అదేవిధంగా భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఎంఈఓలు చొరవ చూపాలని సూచించారు. ఈ సమీక్షలో పలమనేరు, పెద్దపంజాణి, గంగవరం, బైరెడ్డి పల్లి, వి.కోట, ఎంఈఓలు లీలారాణి,గోపాల్ రెడ్డి,తులసిరాం, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, మురుగేష్ తదితరులు ఉన్నారు.

## పార్క్ అభివృద్ధిలో కాలనీవాసుల కీలక పాత్ర

### కార్పొరేటర్ మద్ది సబితా రెడ్డి



**బాలాపూర్, జనవరి 24 (నిఘా న్యూస్):** పార్క్ అభివృద్ధి, డివిజన్ అభివృద్ధిలో తమ డివిజన్ వాసుల పాత్ర కీలకమని, తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ మద్ది సబితా రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని న్యూ గాయత్రి నగర్ లోని పార్క్ ను సాధారణనిధులతోఅభివృద్ధి చేసి కాలనీ వాసులకు అందుబాటులోకి తెచ్చారు. తన స్వంతనిధులు కూడా కొన్ని వెచ్చించినట్లుగా తెలిపారు. సీనియర్ సిటిజన్ లు, విద్యార్థులకు, మహిళలకు పార్కు ఆహ్లాద వాతావరణం ఆటవిడుపులా ఉంటుందని అన్నారు. డివిజన్ లోని అన్ని కాలనీలో మౌలిక వసతులు కల్పించదానికి కృషిచేస్తామని, అభివృద్ధికి తమ శాయశక్తుల కృషి చేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రావు, వీర రాజు, పాండయ్య, రామకృష్ణ, కోటేశ్వరరావు, నళిని, సునంద, మాలతి, ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

## బీస్ డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆరణి



**తిరుపతి, జనవరి 24 (నిఘా న్యూస్):** బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి (బీస్)-2025 డైరీని తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ఆవిష్కరించారు. తిరుపతిలో ఓ ప్రైవేట్ హోటల్ లో శుక్రవారం బీస్. డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న బలిజ ఉద్యోగులు ఏకమై వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండడం గొప్ప విషయమన్నారు. ఈ పరంపర ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. బీస్ వ్యవస్థాపక అధ్యక్షులు పి.అనిల్ కుమార్ మాట్లాడుతూ బలిజ ఉద్యోగుల పరస్పర సహకారం కోసమే బీస్ ఏర్పాటైందని వివరించారు. బలిజల అభ్యున్నతికి బీస్ ఎంతగానో తోడ్పాటు నందిస్తోందని తెలిపారు. అనంతరం బీస్ గౌరవాధ్యక్షులు ఎస్.ముని శంకరయ్య, చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నీలం నరేంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి తోకల అశోక్ కుమార్ లు మాట్లాడుతూ వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న బలిజ ఉద్యోగులు కులంతో సంబంధం లేకుండా అన్ని కులాలవారికి, మతాల వారికి సహాయ సహకారాలను అందిస్తున్నారని తెలిపారు.బీస్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మాజీ ఎమ్మెల్యే ఏ.మోహన్, నెల్లూరు బీస్ ప్రధాన కార్యదర్శి చక్రధర్,బీస్ ఉపాధ్యక్షులు సిహెచ్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, బాస్ అధ్యక్షులు సురేష్,పూల సురేష్, సాయి సుధాకర్, కిషోర్, ప్రభు రెడ్డి, వి.చంద్రశేఖర్ రావు, పి.బాలాజీ, కె.జయప్రకాశ్, తోట మధుసూధన,ఎ. మోహన్, నాగరాజు, కిషోర్, వేంకటాద్రి, కె.మురళి,¯ ఽ.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## సాయినగర్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై గ్రామసభ

### అన్ని రంగాలలో అభివృద్దే ధ్యేయం

**తిరుపతి రూరల్, జనవరి 24 (నిఘా న్యూస్):** తిరుపతి రూరల్ మండలం సాయినగర్ గ్రామపంచాయతీలో శుక్రవారం సాయినగర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ డి.వి.రమణ అధ్యక్షతన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక మీద గ్రామ సభ నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్, డి.వి.రమణ మాట్లాడుతూ గ్రామపంచాయతీని అన్నీ రంగాలలో అభివృద్ధి పథంలో పయనింప చేయడమే ధ్యేయంగా, సాయినగర్ గ్రామ పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలియజేశారు. ఇంకా పంచాయతీని అభివృద్ధి వైపు నడిపించడానికి కావలసిన సిసి రోడ్లు, డ్రైనేజీలు, ఓవర్ హెడ్ ట్యాంక్,నీటి సంపు, నీటి పైప్ లైన్లు మొదలగు పనులను గుర్తించామని, ఈ పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సహకారంతో పూర్తి చేస్తామని గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి టి.శ్రీలేఖ మాట్లాడుతూ పంచాయతీకి అభివృద్ధి ప్రణాళిక ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, పంచాయతీ వార్డు సభ్యులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది. ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, పాఠశాల సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొని గ్రామపంచాయతీ ప్రణాళికను తయారు చేయడంలో సూచనలు తెలియజేశారు. 10 కోట్ల రూపాయల విలువ గల వివిధ పనులను గుర్తించి గ్రామ సభలో ఆమోదించారు.




## కడప ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో జీపు జాత

- బాబు, జగన్ లు కడప ఉక్కును శిలాఫలకాల పరిశ్రమగా మార్చారు
- సిపిఎం రాష్ట్ర మహాసభల పోస్టరు విడుదల
- జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్

**కడప, జనవరి 24 (నిఘా న్యూస్):** సిపిఎం రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశం సకడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫిబ్రవరి 1, 2, 3, తేదీలలో నెల్లూరులో జరుగుతున్న సందర్భంగా సిపిఎం రాష్ట్ర 27వ మహాసభల గోడ పత్రాలను సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.రామ్మోహన్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు పి.దస్తగిరి రెడ్డి, బ్రహ్మంగారిమఠం మండల కార్యదర్శి జి.సునీల్ కుమార్ లు విడుదల చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర 27 మహాసభల సందర్భంగా కడప జిల్లాలో సిపిఎం జిల్లా కమిటీ జనవరి 30, 31వ తేదీలలో “కడప ఉక్కు - ఆంధ్రుల హక్కు” నినాదంతో “జీపు జాత” నిర్వహిస్తున్నామని తెలిపారు. కడప ఉక్కుఫ్యాక్టరీని “శిలాఫలకాల ఫ్యాక్టరీ”గా మార్చిన ఘనత టిడిపి, వైఎస్ఆర్పిపి లదేనని ఎద్దేవ చేశారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు మాజీ జిల్లా ఎం.పి.పెద్ద పసుపుల ఈశ్వర్ రెడ్డి విశాఖ ఉక్కు కోసం పదవికి రాజీనామా చేశారని, వారి స్ఫూర్తితో కడప జిల్లాలోని ప్రజాప్రతినిధులు కడప ఉక్కు కోసం జిల్లా ప్రజలు పోరాడాలని కోరుతున్నారని తెలిపారు.



## చిన్నారులలో ఎదుగుదల, వైకల్య లోపాన్ని గుర్తించండి

### జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వెంకటరమణ

**వికారాబాద్, జనవరి 24 (నిఘా న్యూస్):** ఆరు సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులలో ఎదుగుదల లోపం, వైకల్య లోపం, బుద్ధి మాంద్యం, వినికిడి లోపం, మానసిక వైకల్యం తదితర ఆరోగ్య లోపాలు ఉన్న చిన్నారులను ప్రాథమిక దశలోనే గుర్తించి, మెరుగైన వైద్య సేవలు అందిస్తే వారు సాధారణ పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ వెల్లడించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మహావీర్ వైద్య విద్య కళాశాలలోని ఆడిటోరియంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ పర్ ది ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజేబులిటీస్ స్వచ్ఛంద సంస్థ సికింద్రాబాద్ వారి సౌజన్యంతో మహిళా ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు, అంగన్వాడి టీచర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవీందర్ యాదవ్ హాజరై చిన్నారులో ఉండే ఆరోగ్య లోపాలను గుర్తించడానికి అవసరమయ్యే కిట్లను పంపిణీ చేశారు. డాక్టర్ ఋషికేష్ దేశ్ పాండే, డాక్టర్ గౌతమ్ రాజు పైన సూచించిన సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ డాక్టర్ ప్రవీణ్, జిల్లా ఆరోగ్య ఉపవిస్తరణ అధికారి శ్రీనివాస్, డి.పి.హెచ్.ఎన్.ఓ చండీశ్వరి, ఆరోగ్య బోధకులు రజిత పాల్గొన్నారు.



## జేపసీ ఆధ్వర్యంలో మెటర్నిటీ హాస్పటల్ వద్ద అన్నదానం




**తిరుపతి, జనవరి 24 (నిఘా న్యూస్):** జేపీసీ తిరుపతి వారి ఆధ్వర్యంలో మేటర నటి హాస్పిటల్ వద్ద రోగులకు, పేదలకు అల్పాహార ఆహారాన్ని అందించారని ఇలాంటి కార్యక్రమాల్లో చేపట్టిన జేపీసీ వారిని ముఖ్య అతిథిగా వచ్చిన సినిమా ప్రొడ్యూసర్ బాలాజీ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ అభినందించారు. శుక్రవారం స్థానిక మెటర్నిటీ హాస్పటల్ నందు పేషెంట్స్ కి మరియు వారి బంధువులకు ఉచితంగా అల్పాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ ప్రొడ్యూసర్, బాలాజి నర్సింగ్ కాలేజీ ఛైర్మన్ ప్రవీణ్ విచ్చేశారు ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ పేదవారికి ముఖ్యంగా పేద మహిళలకు అందించే ఈ అల్పాహారం వారికి వారి బంధువులకు ఎంతగానో తోడ్పడుతుందని ఇలాంటి కార్యక్రమాల వల్ల సామాన్య ప్రజలకు ఎంతగానో ఉపకరిస్తుందని దీని ద్వారా వారి ఆరోగ్యమే కాకుండా వారు నిత్య జీవితంలో ఎంతో ఉత్సాహంగా వారి పనులు చేసుకోగలరని జేపీసీ తిరుపతి వారు ఎంతో ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం ఆనందదాయకమని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి హాస్పిటల్స్ సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి రెడ్డి ఆర్ఎంవో డాక్టర్ ఆర్ఆర్ రెడ్డి,జేపీసీ సభ్యులు జీవన్ వైస్ చైర్మన్ జేసీ, శంకర్ జోన్ ఆఫీసర్స్ జెసి సోమయ్య జెసి రమణ,జెసి గుణ, జెసి రాజేష్,జెసి భాస్కర్ జెసి వినయ్, జెసి పద్మనాభం జెసి సభ్యులు జెసి దిలీప్ కుమార్ రెడ్డి, జెసి దిలీప్ కుమార్ తదిరులు పాల్గొన్నారు.

## నాసిరకం ఫర్టిలైజర్ తో ఎండిన వరి పంట

### దుకాణం ముందు ఆందోళనకు దిగిన రైతులు

### ల్యాబ్ రిపోర్ట్ వచ్చాక చర్యలు తీసుకుంటామన్న ఏ ఓ రామకృష్ణ



**మద్దూర్, జనవరి 24 (నిఘా న్యూస్):** నాసిరకం పురుగుల మందు స్ప్రే చేయడం తో ఓ రైతు నష్ట పోయాడు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలోని వరలక్ష్మి ఫర్టిలైజర్ షాప్ లో మండలం లోని మోమినాపూర్ గ్రామానికి చెందిన రైతు పల్లెం కనకప్ప తండ్రి హన్మప్ప గత 15 రోజుల క్రితం వరి నాటు వేశాడు. పంట దిగుబడి కోసం నాసిరకం పురుగుల మందు తీసుకెళ్లి నాటు వేశాక స్ప్రే చేశాడు. దీంతో వరి మొత్తం ఎండుముఖం పట్టింది. అవ్వాక్కైన రైతు శుక్రవారం సదరు ఫర్టలైజర్ షాప్ ముందు ఆందోళన కు దిగాడు. నష్ట పరిహారం కట్టించాలని షాప్ యజమానిని నిలదీశాడు. విషయం తెలుసుకున్న ఏ ఓ రామకృష్ణ పొలానికి వెళ్ళి పరిశీలించారు. ఫర్టలైజర్ స్ప్రే చేయడంతోనే పంట ఎండి నట్టు నిర్ధారించాడు. అనంతరం షాప్ లో నాసిరకం మందును తీసుకొని పరిశీలించి ఓనర్ పై ఆగ్రహం వ్యక్తం చేశాడు.ఇక ముందు ఇలా జరిగితే షాప్ ను సీజ్ చేస్తామని హెచ్చరించాడు. నాసిరకం మందు షాంపిల్ ను ల్యాబ్ కు పంపిస్తున్నట్టు దాని రిపోర్ట్ ఆధారంగా షాప్ ఓనర్ పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు.



ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య స్వామి వారు దేవస్థానానికి విచ్చేశారు. వారిని దేవస్థానం డిప్యూటీ ఓ ఎన్.ఆర్ కృష్ణారెడ్డి స్వాగతం పలికి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఓ ఎన్.ఆర్ కృష్ణారెడ్డి పి.ఆర్.ఓ రవి, వేదపండితులు జోషి శర్మ, ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

*-శ్రీకాళహస్తి, జనవరి 24 (నిఘా న్యూస్):*

## ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

### బాలికలు అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించిన పీవో

**చింతూరు, జనవరి 24 (నిఘా న్యూస్):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవము ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు వ్యాసరచన పోటీ, డ్రాయింగ్ కంపిటేషన్స్ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్ విచ్చేసి బాలికలను ఉద్దేశించి ప్రసంగించారు. బాలికలు అందరు చక్కగా చదువుకుని అన్నీ రంగాల్లో రాణించాలని అదేవిధంగా విద్యార్థులు అందరు వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని, క్రమశిక్షణతో జీవించాలని, మార్చి లో జరిగే పదవ తరగతి పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో గెలుపొందిన వారికీ బహుమతులు అందచేశారు. పాఠశాల గణిత,హిందీ, ఆంగ్ల ఉపాధ్యాయులతో పిల్లల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన బాలికలకు ఐటీడీఏ తరపున ప్రత్యేక బహుమతి అందిస్తానని ఈ కార్యక్రమంలో భాగంగా తెలిపారు. అదేవిధంగా జిల్లా ఉపవైద్యాధికారి. పి.పుల్లయ్య మాట్లాడుతూ చదువుతో పాటు ఆరోగ్యం కూడా చాలా అవసరం అని, రక్తహీనత బారిన పడకుండా పిల్లలే వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించే విధంగా ఉండాలని చెప్పారు. మొదట 25 సంవత్సరాలు ఏ పిల్లలు అయితే కష్టపడతారు వారు లైఫ్ లో పైకి ఎదుగుతారని వివరించారు. ఒకరికి ఒకరు సపోర్టుగా అంటూ తోటి వారికి సహాయం చేసే విధంగా ఉండాలని పిల్లలకు సూచించారు. అత్యున్నత స్థానాల్లో ఉన్న మహిళలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని, చదువుతోనే సాధికారత సాధించగలరని, సమాజంలో అసమానతలు తొలగాలి అంటే అందరూ బాలికలు ఉన్నత స్థానాల్లో ఉండే విధంగా కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్సై రమేష్ బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో ఎవరు పర్సనల్ ఇన్ఫర్మేషన్, ఫోటోస్ షేర్ చెయ్యకూడదని, సమాజంలో బాలికలు, మహిళలు పైన జరుగుతున్న అటువంటి అన్యాయాలు పైన అందరూ అవగాహన కలిగి ఉండాలని, వాటిని ఎదురించి పోరాడే విధంగా తయారువ్వాలని ఈ కార్యక్రమంలో భాగంగా తెలియజేసారు. ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి మండల రెవెన్యూ అధికారి చిరంజీవి మాట్లాడుతూ బాలికలు ఎటువంటి ప్రలోభాలకు లోనవ్వకూడదని మంచి స్థాయిలో ఉండాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి విజయగౌరి మాట్లాడుతూ బాలికలందరు చదువు పైన శ్రద్ధ చూపించాలని, అత్యున్నత స్థానాల్లో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహా నిర్మూలన చట్టం 2006, న్యూట్రిషన్, పోస్కో చట్టం మొదలగు అంశాలపై బాలికలకు అవగాహన కల్పించాలన్నా రు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బాలకృష్ణ ,ఉపాధ్యాయ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయి
### ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి



**తాండూరు, జనవరి 24 (నిఘా న్యూస్):** ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి ప్రజలకు భరోసా కల్పించారు. బషీరాబాద్ మండల పరిధిలోని నవలగా గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభ కార్యక్రమానికి ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై సభను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో నే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని వెల్లడించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను విడతలవారీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే కార్యక్రమం నిరంతర కార్యక్రమం అని గుర్తు చేశారు. ఆఖరి లబ్ధిదారుల వరకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వెంకటరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కలాల్ నర్సింలు గౌడ్, మాజీ జెడ్పిటిసి రాకేష్ మహారాజ్, మండల తహసీల్దార్ వై.వెంకటేష్, మండల స్థాయి అధికారులు ప్రజలు పాల్గొన్నారు.



**దావోస్ పర్యటన అనంతరం ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గన్నవరం విమానాశ్రయంలో ఆయనకు గన్నవరం ఎమ్మెల్యే ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఘన స్వాగతం పలికారు.**

*-గన్నవరం జనవరి 24 (నిఘా న్యూస్):*

## దుర్శేడ్ పాఠశాలలో అన్నదాన కార్యక్రమం



**కరీంనగర్ రూరల్, జనవరి 24 (నిఘా న్యూస్):** కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడు గ్రామానికి చెందిన కోరుకంటి రాంగోపాల్ రావు స్మారకార్థం వారి కుమారులు అంజన్ రావు నేడు దుర్శెడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంజన్ రావు మాట్లాడుతూ.. మా నాన్నగారి కోరిక మేరకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా నేడు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం చేయడం ఎంతో తృప్తి గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నాకర్, గ్రామ పెద్దలు కోరుకంటి వేణుమాధవరావు, సుంకిశాల సంపత్ రావు, కోరుకంటి వెంకటేశ్వరరావు, నర్సింగరావు, ఆత్మ చరన్ రావు, సన్నత్ కుమార్, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్స్ సంఘం నూతన కమిటీకి సన్మానం

**ధర్మపురి, జనవరి 24 (నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని ధర్మారం మండలం ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం మండలంలోని స్థానిక గౌతమ బుద్ధ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేయగా, ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఫోటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం, రాష్ట్ర సలహాదారులు మహిమల కేదార్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి లాడే రవి, ఉపాధ్యక్షులు పల్లెర్ల ఉదయ్, పూజ ల్యాబ్ అధినేత పి.రాజేష్ రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్ ప్రధాన కార్యదర్శి ఇర్ఫాన్, కోశాధికారి అల్లం సతీష్ హాజరై కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రం పటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీ గౌరవ సలహాదారులుగా ఎదుల్ల. ప్రభాకర్,సలహాదారులు సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అధ్యక్షులు జి.కంటేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఆర్.ముకుందరావు,కోశాధికారి బి.భూపతి, ఉపాధ్యక్షులు బి.తిరుపతిరావు, సంయుక్త కార్యదర్శి ఎం.మధు, ప్రచార కార్యదర్శి బి.శ్రీధర్ కార్యవర్గ సభ్యులు కె.మల్లేశం బి.సంతోష్ ఎన్.చిరంజీవి, ఎం.ఆంజనేయులు, ఎన్.రాజేందర్ సన్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలో యూనియన్ బలపేతానికి అందరూ కట్టుబడి పని చేయాలని సూచించారు. అలాగే ప్రతి మండలంలో యూనియన్ కార్యాలయం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.



**యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోత్నక్ ప్రమోద్ సతీమని ఇటీవల మృతి చెందగా ఈరోజు భువనగిరి జిల్లా కేంద్రంలోని వారి నివాసంలో వారి చిత్రపటానికి పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతం శెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంధాలయ చైర్మన్ ఆవేద్ చిస్తీ, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ బాలయ్య, మాజీ కౌన్సిలర్ నర్సింహా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బిల్లపాటి సురేందర్ రెడ్డి, నూక కిరణ్, అడ్వకేట్ యుగంధర్, ఎంపిటిసిల ఫోరమ్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, నాయకులు అత్తార్, హెరెకర్ శ్రీను ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు ఉన్నారు.**

*-భువనగిరి, జనవరి 24 (నిఘా న్యూస్):*

## స్ట్రీట్ లైట్స్ వేయడంపై హర్షం



**శేరిలింగంపల్లి, జనవరి 24 (నిఘా న్యూస్):** గచ్చిబౌలి డివిజన్ హుడా లేఔట్ కాలనీ రాక్ గార్డెన్ 100 ఫీట్ల రహదారిలో సరైన స్ట్రీట్ లైట్స్ లేని కారణంగా ప్రజలకు ఏర్పడిన ఇబ్బందులు తొలగిపోవడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. హుడా కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ,జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఆదేశాలతో రాక్ గార్డెన్ 100 ఫీట్ల రోడ్ లో జిహెచ్ఎంసి ఎలక్ట్రికల్ డీఈ కవిత,ఏఈ లిఖిత,సిబ్బందితో శుక్రవారం కొత్తగా స్ట్రీట్ లైట్స్ వేయించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గాంధీ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డికి నల్లగండ్ల హుడా కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

### గ్రామసభలో గందరగోళం..
# అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

**అశ్వారావుపేట, జనవరి 24 (నిఘా న్యూస్):** అశ్వారావుపేట మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో గందరగోళం చోటుచేసుకుంది. గ్రామసభ ప్రారంభానికి ముందు నుంచే అనూహ్య పరిణామాలు చోటుచేసుకోవడం కలకలం రేపింది. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఈ సమావేశానికి హాజరైనా, పంచాయతీ కార్యదర్శి మినహా మరెవ్వరూ హాజరుకాక పోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఎమ్మెల్యే జారే తీవ్రంగా మండిపడ్డారు. బాధ్యతారాహిత్యానికి పాల్పడిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సూచించారు. ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను మరచి ఇలాగే వ్యవహరిస్తే ఉపేక్షించం, అని ఆయన హెచ్చరించారు. ఆగ్రహంతో ఆయన వెనుతిరిగి వెళ్ళిపోయారు. ఎమ్మెల్యే వెళ్లిపోయిన తర్వాత వచ్చిన అధికారులు గ్రామసభను ప్రారంభించారు. లబ్ధిదారుల జాబితాను చదవగా, తమ పేర్లు లేవని గ్రహించిన పేదలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోంది.



జిరాక్స్ షాపుల వారికి లబ్ధి చేకూరడానికి తప్ప తమకు ఎలాంటి ప్రయోజనం లేదు, అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో పాల్గొన్న ఓ అంధుడు తనకు ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి అందలేదని ప్రశ్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అతనిని పక్కకు తీసుకువెళ్లడంతో గ్రామస్థుల ఆగ్రహం మరింత పెరిగింది. తమకు



న్యాయం జరిగే వరకూ ఆందోళన ఆగదు, అంటూ వారు అధికారులకు హెచ్చరించారు. అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. గ్రామసభలో పేదలకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల నమ్మకాన్ని నాశనం చేస్తోందని గ్రామస్థులు ఆరోపించారు. సభలో చెలరేగిన గందరగోళం స్థానికంగా పెద్ద చర్చకు దారితీసింది.

# మత్తు పదార్థాల వినియోగంతో నష్టాలపై అవగాహన సదస్సు

**గన్నవరం, జనవరి 24 (నిఘా న్యూస్):** నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామం లోని భీమవరపు కృష్ణ మోహన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమములో నేతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్ జాకబ్ రాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవడం కేవలం మీ భవిష్యత్తు ను మాత్రమే కాదు, మీ కుటుంబ సభ్యుల భవిష్యత్తును కుడా ప్రమాదం లోకి నెట్టుతుంది. మత్తుపదార్థాలైన ఆల్కహాల్, పొగాకు, గంజాయి లాంటివాటి వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా యువత వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వాటికి అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు, మొదట్లో సరదాగా తీసుకునే మత్తపదార్థాలు క్రమేపీ నియంత్రణ కోల్పోయి మత్తుకు బానిసలు అవుతారనిన్నారు అని, చెడు అలవాట్లు అనేవి ఒకరు నుంచి ఒకరు అలవాటు పడి తీవ్ర ప్రమాదస్థాయికి చేరుకుంటరని, క్యేన్సర్, ఇతర ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని స్నేహితులు కానీ మరి ఏ ఇతర వ్యక్తులు కానీ మాదక ద్రవ్యాలపై ప్రలోభపెడితే ఖచ్చితంగా వద్దు అని చెప్పాలని, మత్తు పధార్థాలతో బ్రతుకు దుర్భరం చేసుకోవద్దు అని, మత్తుపదార్థాల వలన ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా,



ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతామని తెలిపారు. సరి అయిన అవగాహన లేక మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్న వారు ఎక్కువ మంది వున్నారని, ముందుగానే సరి అయిన అవగాహన పెంచుకొని జీవితాలను చక్క దిద్దికోవాలని అన్నారు. ఈ అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు, అనంతరం ఉంగుటూరు పోలీస్ స్టేషన్ నుండి కానిస్టేబుల్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థులు ఒక్కసారి ధూమపానం, మద్యం సేవించడం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కృంగిపోవడం జరుగుతుందనిన్నారు. అది నేర ప్రవృత్తివైపు కూడా ప్రేరేపిస్తుందని అని అన్నారు. అనంతరం నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్స్ ఎస్ కే నజ్మ, డి విజయారాణి మాట్లాడుతూ ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను, యువత ను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొని రావచ్చని ఈ చికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ సంస్థ వారు నూజివీడులో బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసింది అని ఈ లాంటి సమస్యలతో ఉన్నవిద్యార్థులకు, యువతకు నూజివీడు మండలం పోలసానపల్లిలో ఏర్పాటు చేసిన బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని ఉచితంగా సంప్రదించవచ్చుని, సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490492020 అని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి వి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వలన విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందని, ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నవజీవన్ బాల భవన్ వారికీ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమములో తేలప్రోలు గ్రామ అంగన్ వాడి కార్యకర్తలు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కోడి వ్యర్థాల అక్రమ రవాణాలో ఎవరు ఉన్నా ఉపేక్షించం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హెచ్చరిక
- తన పేరుతో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి, జనవరి 24 (నిఘా న్యూస్):** కోడి వ్యవర్థాలను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం తన నివాసంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు దాటినా కోడి వ్యర్థాల అక్రమరవాణా నగరంలో సాగుతుండటం దారుణమని ఆయన అన్నారు. గత సాధారణ ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కోడి బోచ్చును కూడా అప్పటి ఎమ్మెల్యే భూమాన కరుణాకర్ రెడ్డి వదల కుండా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారని ఆయన తెలిపారు. అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చాకా కోడి వ్యర్థాల అక్రమ రవాణా సాగుతుండటం దారుణమని వెంటనే మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకుని నిలుపుదల చేయాలని ఇప్పటికే ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ అక్రమ రవాణాలో చివరకు కూటమి నాయకుల జోక్యం ఉన్నా కేసు పెట్టమని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు ఆయన చెప్పారు. కాగా నగరంలోని ఫుట్ పాత్ లను ఇష్టారాజ్యంగా ఆక్రమించేసి వ్యాపారాలు చేస్తున్నారని ఆయన చెప్పారు. తన పేరు చెప్పి కొందరు స్థానిక నాయకులు వీరి వద్ద వసూళ్లకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చినట్లు చెప్పిన ఆయన ఇలాంటివాటిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించమని హెచ్చరించారు. తోపుడు బండ్లపై ఆధారపడి జీవించేవారికి ఫుడ్ కోర్టులు ఏర్పాటుచేయమని మున్సిపల్ అధికారులను సూచించినట్లు ఆయన చెప్పారు. పాదచారులకు ఇబ్బందులు లేకుండా ఫుట్పాత్లను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. మరోవైపు తిరుమలలో తమ పేరు చెప్పి అనధికారికంగా తట్టలు పెట్టుకు టున్నారని, అలాంటివారిపై తగిన చర్యలు తీసుకోవాలని టీటీడీ అధికారులను కోరడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మన విచ్చలవిడిగా తిరుమలలో అక్రమ తట్టల వ్యాపారాలు సాగించడంతో ఇప్పుడు కూడా వాళ్లే కొనసాగుతున్నారన్నారు. తిరుపతిని గంజాయి వనంగా వైసిపి నాయకులు మార్చారని కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో గంజాయి అమ్మకాలు క్రమంగా తగ్గుతున్నాయని ఆయన తెలిపారు. తిరుపతి పుణ్యక్షేత్రంలోని ప్రజలు, తిరుమలకు వచ్చే భక్తులు ప్రశాంతవాతావరణంలో ఉండేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## సీఐటియు ఆధ్వర్యంలో.. మున్సిపల్ కార్మికుల నూతన కార్యవర్గం ఎన్నిక



**అబ్దుల్లాపూర్ మెట్, జనవరి 24(నిఘా న్యూస్):** పెద్దఅంబర్ పేట్ పురపాలక సంఘం కార్మికుల మహాసభ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా గార్డెన్ లో నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సభకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, పెద్దఅంబర్ పేట్ మున్సిపల్ చైర్ పర్సన్ పండుగుల జయశ్రీ ముఖ్య అతిథులుగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ కార్మికులకి ఎప్పుడూ అండగా ఉంటామని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు కిషన్ మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారిన కార్మికుల బతుకులు మాత్రం మరలేదని రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను పర్మినెంట్ చేయాలని కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పింకాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎరుపుల నర్శిహ, గుండె శివకుమార్ పాల్గొని మాట్లాడారు. అనంతరం మున్సిపాలిటీలో వివిధ పనులు చేస్తున్న కార్మికులతో నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా మైసయ్య, జ్యోతిబసు, కమిటి సభ్యులుగా జంగయ్య, నర్శిహ, లింగస్వామి, తరుణ్, దానయ్య, పాండు, లక్ష్మమ్మ, వసంత, కలమ్మ, నర్సమ్మ, రవి, పోచయ్య, మొత్తం 25 మందితో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

## అర్హులను లబ్ధిదారుల జాబితాలో చేర్చండి

- స్వీకరించిన దరఖాస్తులకు త్వరితగతిన సర్వే చేయాలి
- పొరపాట్లను సరిచేసి పూర్తి జీబితాను ప్రకటించండి
- సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు



**మధిర, జనవరి 24 (నిఘా న్యూస్):** ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకొని అర్హుల జాబితాలో పేర్లు నమోదికాని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని అర్హులైన ప్రతి పేద కుంటుంబాని ఇందిరమ్మ ఇండ్లు,తెల్ల రేషన్ కార్డులు,రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు జాబితా తయారు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు కోరారు.మండలంలో పరిధిలో మూడవరోజు,నాలుగవ రోజు నిర్వహించిన వార్డు, గ్రామసభల్లో సిపిఐ బృందం పాల్గొని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియని పర్యవేక్షించారు.ఈ సందర్బంగా మడుపల్లి అజయ్ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు సమావేశంలో కొండలరావు మాట్లాడుతూ,ప్రజాపాల గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులపై సర్వే నిర్వహించిన అధికారులు అర్హుల జాబితాను ప్రకటించారని, పూర్తిస్థాయిలో జాబితాలో అర్హులను చేర్చకపోవడంతోఆందోళనకుగురి అవుతున్నారన్నారు. గ్రామసభల్లో కొత్తగా స్వీకరించిన దరఖాస్తులకు తక్షణమే సర్వే చేపట్టి పూర్తి స్థాయిలో జాబితాను సిద్ధం చేసి ప్రకటించాలని అధికారులను కోరారు.ప్రకటించిన అర్హుల జాబితాలో జగిరిన పొరపాట్లను సరిచేయాలన్నారు.ఏఒక్క అర్హుడికి అన్యాయం జరిగినా ఊరుకునేది లేదని జాబితాను సిద్ధంచేసి ప్రజల ముందుంచే భాధ్యత అధికారయంత్రంగంపై ఉందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిబంధనలను సవరించాలన్నారు. భూమిలేని పేదలకు 12 వేల రూపాయలుఇవ్వాలన్నారు.కార్యక్రమంలోఅన్నవరపుసత్యనారాయణ , జల్లా బ్రహ్మం, మల్లవరపు గోపి తదితరులు ఉన్నారు.

# కరీంనగర్ డంప్ యార్డ్ సమస్యకు త్వరలో పరిష్కారం

- మనోహర్ లాల్ కట్టర్ పర్యటన దిగ్విజయవంతం
- రాజకీయాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపై తీసుకొచ్చిన బండి



కరీంనగర్, జనవరి 24 (నిఘా న్యూస్): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కృషి ఫలించింది. కరీంనగర్ ప్రజలను ఏళ్ల తరబడి వేధిస్తున్న 'డంపింగ్ యార్డ్ ' సమస్యకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ పర్యటనతో ఎట్టకేలకు పరిష్కారం లభించేలా చేయడంలో సంజయ్ విజయవంతమయ్యారు. డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తానని, అందుకు ఎంత ఖర్చయినా కేంద్రమే భరిస్తుందని బహిరంగ సభ వేదికగా కేంద్ర మంత్రి హామీ ఇవ్వడంతో కరీంనగర్ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. బండి సంజయ్ చేసిన కృషి వల్లే ఇది సాధ్యమైందని రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు, ప్రజలు చర్చించుకోవడం గమనార్హం. మరోవైపు కేంద్ర హౌజింగ్ మంత్రిగా ఉన్న కట్టర్ కరీంనగర్ వేదికగా తెలంగాణ రాష్ట్రానికి అధిక సంఖ్యలో ఇండ్లు కేటాయిస్తామని ప్రకటించడం మరో సానుకూల పరిణామం. ఈ ఏడాది కోటి ఇండ్లను దేశవ్యాప్తంగా నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. అందులో తెలంగాణకు రావాల్సిన వాటా కంటే అధికంగా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాం"అని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి చేసిన తాజా ప్రకటన రాష్ట్రంలో ఇండ్లులేని పేదల పాలిట వరంగా మారనుంది. కట్టర్ హామీపట్ల రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మరో మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం సంతోషం వ్యక్తం చేశారు. "గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లను నిర్మించకుండా పేదల పొట్టకొట్టింది. నిలువ నీడ లేకుండా చేసింది. ఫలితంగా రాష్ట్రంలో 65 లక్షల కుటుంబాలకు పైగా ఇండ్లు కావాలని ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్నారు. కేంద్రం అధికంగా ఇండ్లను మంజూరు చేస్తే పేదలకు గూడు లభిస్తుంది"అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి కరీంనగర్ బహిరంగ సభా వేదికగా పేర్కొన్నారు. కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ను కరీంనగర్ తీసుకురావడంలో, హామీలు ఇప్పించడంలో స్థానిక ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కరీంనగర్ లో ఏళ్ల తరబడి వేధిస్తున్న" డంపింగ్ యార్డ్" సమస్యకు ఎట్లాగైనా పరిష్కరించాలని కంకణం కట్టుకున్న బండి సంజయ్ కుమార్ కొద్దిరోజుల క్రితమే ఈ విషయాన్ని మనోహర్ లాల్ కట్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కరీంనగర్ డంపింగ్ యార్డ్ ద్వారా దాదాపు 10 డివిజన్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, అనేక రోగాలతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించడం ద్వారా కరీంనగర్ ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. బండి వినతిపట్ల ఆనాడే మనోహర్ లాల్ కట్టర్ సానుకూలంగా స్పందించారు. తాజాగా కరీంనగర్ బహిరంగ సభా వేదికగా 'డంప్ యార్డ్' సమస్యను పరిష్కరిస్తామని, అందుకు ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు సిద్ధమని హామీ ఇవ్వడంతో బీజేపీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకోవైపు కరీంనగర్ అభివృద్ధి విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కూడా సంజయ్ తో కలిసిరావడం కరీంనగర్ ప్రజలతోపాటు రాష్ట్ర రాజకీయాల్లోనే చర్చనీయాంశమైంది. జెండా, ఎజెండాలు వేరైనా కరీంనగర్ అభివృద్ధి విషయంలో తమది ఒకే మాట అని, కరీంనగర్ అభివృద్ధే తమకు ప్రధాన ఎజెండా అని ఈ సభా వేదికంగా ముగ్గురు నేతలు చెప్పడం విశేషం. రాజకీయ వైషమ్యాలను పక్కనపెట్టి ప్రజా సమస్యలపై కలిసి రావడం శుభ పరిణామమని, ఈ విషయంలో బండి సంజయ్ తీసుకున్న చొరవ అభినందనీయమని కరీంనగర్ లోని మేధావులు, విద్యావేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఒక పార్టీపై ఇంకో పార్టీ నేతలు చిర్రుబుర్రులాడుతూ, కొట్లాడుకుంటున్న ఈ తరుణంలో కరీంనగర్ రాజకీయాలు ఆదర్శంగా నిలుస్తాయనడంలో సందేహం లేదని రాజకీయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## గోగులమ్మకు జలాభిషేకం



పెదపూడి, జనవరి 24 (నిఘా న్యూస్): అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం గొల్లల మామిడాడ సంత మార్కెట్లో కొలువై ఉన్న గోగులమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కడిమి వీర వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 28వ తేది మంగళవారం అమ్మవారికి జాతర మహోత్సవాన్ని, 29వ తేది బుధవారం నైవేద్యాలు, మొక్కు బడులు నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో భక్తులు భాగస్వాము లై అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొవ్వూరి,ద్వారంపూడి వారు జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశారని ఆలయ కమిటీ చైర్మన్ కడిమి వీర వెంకట మురళీకృష్ణ తెలిపారు.

## గణతంత్ర వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాలి

- పాఠశాలల్లో మొక్కుబడిగా మారిన గణతంత్ర వేడుకలు
- విద్యార్థులకు అవగాహన కల్పించని యాజమాన్యాలు
- షెడ్యూలు కులాల హక్కుల పరిరక్షణ జిల్లా అధ్యక్షులు మాస శేఖర్



ఉప్పల్, జనవరి 24 (నిఘా న్యూస్): గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఖచ్చితంగా అంబేద్కర్ ఫోటో పెట్టాలని అధికారులు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్, ప్రభుత్వ స్కూళ్లు కాలేజీల యాజమాన్యాలకు అంబేద్కర్ ఫోటో పెట్టాలని షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం ఏఐఎస్సి ఆర్పిఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మాస శేఖర్ విజ్ఞప్తి చేశారు. జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి చోట ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో జెండా ఆవిష్కరణలలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటో తప్పనిసరిగా పెట్టాలని కోరారు. స్వతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవం ఎందుకు జరుపుకుంటారో తెలిసిన మేధావులారా, కావాలని అంబేద్కర్ ఖ్యాతిని బంగపరిచేలా ప్రవర్తిస్తే ఊరుకోమని, కొన్ని స్కూల్స్‌లో గణతంత్ర దినోత్సవం ఎందుకు జరుపుకుంటారో కూడా విద్యార్థులకు తెలుపడానికి సిద్ధపడని స్కూల్ అధ్యాపకులు, ప్రతి స్కూల్‌లో ప్రోగ్రామ్ ఏర్పాట్లు చేసి ఆ సందర్భం గొప్పతనాన్ని పిల్లలకూ తెలపాల్సిన బాధ్యత మరిచి జండా ఎగురవేసి స్వీట్ ఇచ్చి హడావిడి గా విద్యార్థులను ఇండ్లకు పంపించి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## స్టూడెంట్ ట్రైబ్ ఆధ్వర్యంలో... ద అల్టిమేట్ టాలెంట్ హంట్

### విజేతలకు నాగచైతన్య, అల్లు అరవింద్ బహుమతులు అందజేత




హైదరాబాద్, జనవరి 24 (నిఘా న్యూస్): దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద విద్యార్థి సంఘం స్టూడెంట్ ట్రైబ్ నగరంలోని శిల్పకళావేదికలో స్టూడెంట్ ట్రైబ్ గాట్–ది అల్టిమేట్ టాలెంట్ హంట్ గ్రాండ్ ఫినాలేను నిర్వహించినట్లు స్టూడెంట్ ట్రైబ్ ఫౌండర్ అండ్ సీఈఓ శ్రీచరణ్ లక్కరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలో వివిధ కేటగిరీల్లో విజేతలకు సినీ ప్రముఖులు నాగచైతన్య, అల్లు అరవింద్, ఫరియా అబ్దుల్లా బహుమతులు అందజేసినట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ ద్వితీయ, తృతీయ శ్రేణి కళాశాలలతో సహా అన్ని స్థాయిల్లోని విద్యార్థులకు అవకాశాలను కల్పించడంలో నిబద్ధత కనబరిచినట్లు తెలిపారు. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిభావంతులైన యువత ఒకే వేదికపైకి వచ్చి, వారి సృజనాత్మకత, అభిరుచి, నైపుణ్యాలను ప్రదర్శించారని తెలిపారు.



### నాలుగు కోట్ల పనుల కోసం...

# కరీంనగర్‌లో కాంట్రాక్టర్ల రింగ్

### తక్కువ ధరకే టెండర్లు దక్కించుకోవడానికి వ్యూహం

కరీంనగర్, జనవరి 24 (నిఘా న్యూస్): కొన్ని రోజుల కిందట తాము చేసిన పనులకు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు గుత్తేదారులు ఆందోళన చేశారు. అలాగే తక్కువ కమిషన్ వచ్చే పరులకు టెండర్లను వేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. అయితే ఇప్పుడు నిధులు ఉండి చేసే పనులపై మున్సిపల్ శాఖ టెండర్లు ఆహ్వానించడంతో గుత్తేదారులు తక్కువ ధరకే టెండర్లు దక్కించుకోవడానికి వ్యూహం పన్నుతున్నారు. ఇటీవల కొందరు గుత్తేదారులు సమావేశమై ప్రభుత్వ ఖజానాకు ఆదాయం రాకుండా ప్లాన్ చేశారు ఆ వివరాల్లోకి వెళితే, కరీంనగర్ మున్సిపల్ పరిధిలో కొన్ని అభివృద్ధి పనులకు ఇటీవల ఈ ప్రోక్యూర్మెంట్ టెండర్లను ఆహ్వానించారు. మొత్తం 55పనుల కోసం రూ.4కోట్లను కేటాయించారు. ఈ పనుల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, శ్మశాన వాటికల్ ఆధునికీకరణ, వీధి దీపాలు వంటివి ఉన్నాయి. వీటితోపాటు సూడా పరిధిలో 18 పనుల కోసం టెండలను పిలిచారు.

అయితే ఈ నెల 16వరకు టెండర్ల గడువు ఉండగా.. మూడు పనుల కోసం మాత్రం ఒక్కరు ముందుకు రాలేదు. కానీ ఒక పని కోసం మాత్రం తీవ్రంగా పోటీపడ్డారు. ఈ పనిని దక్కించుకోవడానికి గుత్తేదారులు ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. టెండర్లలో మొత్తం 60 మంది గుత్తేదారులు పాల్గొని ముందస్తుగా రూ. 30 వేల చప్పున డిపాజిట్ చేశారు. ఇలా మొత్తం 18లక్షలు జమ చేసి ఒక్కో పని మీద 15 శాతం మించకుండా వేలంపాట నిర్వహించేలా వ్యూహం పన్నారు. మరోవైపు రూ.12 లక్షలు సేకరించి మొత్తం 30లక్షల పనులు చేయని గుత్తేదారులకు వాటిని చెల్లించనున్నారు. అంటే పోటీ లేకుండా తాము కోరుకున్న ధరలకే టెండర్లను దక్కించుకోవడానికి గుత్తేదారులు పక్కా ప్లాన్ వేసినట్లు సమాచారం. వీరి చర్యల వల్ల ప్రభుత్వ




ఖజానాకు భారీగా గండిపడే అవకాశం ఉందని కొందరు ఆందోళన చేస్తున్నారు. అభివృద్ధి పనులకు ఆన్లైన్ టెండర్ పిలవడంతో ఎవరైనా ఇక్కడి నుంచి అయినా పాల్గొని వీలు ఉంది. అయితే ఆన్లైన్లోనూ ఎవరూ పాల్గొనకుండా వీరు ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది.

### పోలీసు జరిమానాలు...

# ప్రమాదాల నివారణకు హెచ్చరికలు

### ఉట్కూరు ఎస్సై కృష్ణంరాజు



నారాయణపేట, జనవరి 24 (నిఘా న్యూస్): నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలోని బిజ్వార్ గ్రామంలో జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లో ఎస్సై కృష్ణంరాజు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థినీ విద్యార్థులు తమ తల్లిదండ్రులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించేలాగా, ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ డ్రైవింగ్ చేసేలా చూడాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులు, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఉండి ఏదైనా ప్రమాదం జరిగిన సమయం లో ఇన్సూరెన్స్ వర్తించదు కాబట్టి ఇన్సూరెన్స్ గడువు ముగియక ముందే దానిని రినివల్ చేసుకోవాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి బండి ఇవ్వడం, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం చేసే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్ఐ గారు తెలిపారు. పోలీస్ జరిమానాలు అనేవి వాహనదారులకు ఒక హెచ్చరిక లాంటిదని కాబట్టి వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు.

## శ్రీకాళహస్తిలో చివరి మజిలీకి మెడలోతు కష్టాలు

### ఎండి పుత్తూరు స్మశానకి దారి చూపించండి



శ్రీకాళహస్తి, జనవరి 24 (నిఘా న్యూస్): శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం ఎండి పుత్తూరు గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించాలంటే చెప్పనలవి కాని కష్టాలని గ్రామస్తులు వాపోతున్నారు. యం డి పుత్తూరు గ్రామానికి ఈ నాటికీ స్మశానంనకంటూ ఎటువంటి స్థలమూ లేదు. అనాదిగా గ్రామం పక్కనే ప్రవహిస్తున్న స్వర్ణముఖీ నది ఒడ్డున దహన సంస్కారాలు నిర్వహించేవారు.ఇటీవల వర్షాలకు నదిలో నీటి ప్రవాహం అధికమై నదిదాటుటకు అనుకూలంగా లేకున్నది. గ్రామంలో గురువారం చింత పుట్టాలమ్మ(98 సంవత్సరాలు) మరణించారు. శుక్రవారం దహనక్రియలు నిర్వహించుటకు స్వర్ణముఖి నదీ వద్దకు వెళ్లగా అవతల ఒడ్డుకు మెడలోతు నీటి ప్రవాహంలో వెళ్లలేక నానా ఇబ్బందులు పడి ఎలాగోలాగా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంనకు కనీసం దాయాదులు కూడ అవతలి ఒడ్డుకు వెళ్లలేక ఇవతలే చేరుకుని చివరి చూపుచూసుకొని గుప్పెడు మట్టి వేయుటకు నోచుకోలేని దుస్థితి ఏర్పడిందని బాధపడుతూ మాగ్రామానికెప్పుడు ఈ స్మశాన కష్టాలు తీరుతాయని ఆవేదన వ్యక్తంచేసారు. గ్రామంలో వర్షాకాలంలో నీటి ప్రవాహం ఉన్నపుడు ఎవరైనా చనిపోతే నదీ ప్రవాహంలో వదిలే పరిస్థితి వస్తుందని ఆ కాలంలో మరణాలు సంభవించకూడదని దేవుళ్లని ప్రార్థిస్తామని గ్రామస్తులు తమ బాధను తెలిపారు.కావున అధికారులు పెద్దలు మా గ్రామ స్మశాన సమస్యను పరిష్కరించి చివరి మజిలీ కష్టాలనుండి విముక్తి కలిగించాలని గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తపరిచారు.

## బెల్లి లలిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

### బెల్లి లలిత విగ్రహాన్ని ట్యాంకు బండుపై ప్రతిష్ఠించాలి

### ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి



భువనగిరి, జనవరి 24 (నిఘా న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటాలు చేసి హత్య చేయబడిన తెలంగాణ కోకిల బెల్లి లలిత స్థూపాన్ని హైదరాబాదులో ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టించాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్రఅధ్యక్షులు సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం బెల్లి లలిత కుటుంబాన్ని బెల్లి.కృష్ణను కలసి వారి కుటుంబ సమస్యలను ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం భువనగిరి జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు బెల్లి కృష్ణ కుమారుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ తాను తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొట్లాడిన ఉద్యమకారుల న్యాయం చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ చేపట్టే కార్యక్రమంలో పాల్గొంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రపుల్ రామ్ రెడ్డి కోశాధికారి చంద్రన్న ప్రసాద్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ డోలక్ యాదగిరి గంగిరాజు తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత ప్రయాణంలో డ్రైవర్ పాత్ర కీలకం

### డ్రైవర్ల చేతిలో ప్రాణాలను పెట్టి కొనసాగుతున్న ప్రయాణం

### డ్రైవర్లను అభినందించిన ఎస్ఐ జి. నరసింహ





ఘట్‌కేసర్, జనవరి 24 (నిఘా న్యూస్): ప్రయాణం ఎక్కడి కైనా, వాహనం ఏదైనా సురక్షితంగా గమ్యం చేరాలంటే డ్రైవర్ పాత్రే కీలకమని ఘట్ కేసర్ ఎస్సై జి నర్సింహ తెలిపారు. ఘట్ కేసర్ బస్ స్టేషన్ ఆవరణలో చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత ఆధ్వర్యంలో డ్రైవర్స్ డే కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆర్టీసీ డ్రైవర్‌లు పూర్తిస్థాయిలో శిక్షణ పొంది ఉంటారని, ప్రమాద రహిత డ్రైవర్లు ఆర్టీసీ సంస్థలోనే ఎక్కువ శాతం ఎక్కువ శాతం ఉన్నట్లు తెలిపారు. నిర్లక్ష్యాన్ని వీడి ప్రతిక్షణం అప్రమత్తతతో విధులు నిర్వర్తిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని ఆయన తెలిపారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి డ్రైవింగ్ చేయటాన్ని పూర్తిగా విస్మరించాలని చెప్పారు. డిపో మేనేజర్ కవిత మాట్లాడుతూ వాహనం ఎక్కిన ప్రతి ఒక్కరు తమ ప్రాణాలను డ్రైవర్ చేతుల్లో పెడుతున్నట్లే భావిస్తారని, అలాంటి డ్రైవర్ల ప్రాధాన్యతను గుర్తించేందుకు ఏటా జనవరి 24న ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా రవాణా వ్యవస్థలో అతి పెద్ద సంస్థ అయిన ఆర్టీసీ బస్సు లలో నిత్యం వేలాది మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చుతున్నట్లు తెలిపారు. ఏళ్ల తరబడి ఎలాంటి ప్రమాదాలకు గురి కాకుండా బస్సులను నడిపిన ఐదుగురు డ్రైవర్లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. రోడ్డు భద్రత వారోత్సవాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) చంద్రమౌళి, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సహకార బ్యాంకుకు పట్టిన శని రంగబాబు

- ఏసీబీ కేసుల మాఫీకి వైసీపీతో అంటకాగిన వ్యక్తి
- నేడు టిడిపి అని చెప్పుకోవడం సిగ్గుచేటు
- ఎస్సీ అధికారులకు ప్రమోషన్లు ఇచ్చి వెనక్కి తీసుకోవడం బాధాకరం
- ధర్నాను విరమిస్తే ప్రభుత్వానికి వివరించి పరిష్కారం చూపుతాను
- గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం, జనవరి 24 (నిఘా న్యూస్): మచిలీపట్నంలో కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఎస్సీ, ఎస్టీ, బీసీ–సీ అభ్యర్థుల చీఫ్ మేనేజర్ల ప్రమోషన్ల అంశంలో జరిగిన అన్యాయంపై చేస్తున్న ధర్నా కు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సంఘీభావం తెలిపారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొని, బాధిత అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. సమస్య పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని తక్షణమే ధర్నా ను విరమించాలని అభ్యర్థులను కోరారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ కృష్ణాజిల్లా చరిత్రలో ఎన్నడు లేని విధంగా సహకార బ్యాంకులో 100ఉద్యోగాలను, 120మందికి ఇంటెన్షిప్ ఇచ్చానని గుర్తు చేశారు. బ్యాంక్ వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావుల ఫొటో లు అన్ని బ్రాంచ్ లలో పెట్టేలా ఆదేశాలు ఇచ్చానని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయ ఋణాలతో పాటు రైతు బిడ్డలకు విద్య రుణాలు ఇచ్చామని వెల్లడించారు. రైతు నేస్తం పథకం ద్వారా రైతులకు 1200 కోట్ల మేర రుణాలు ఇచ్చామని తెలిపారు. కరోనా సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్ ల కన్నా ఎక్కువ మొత్తంలో లోన్లు మంజూరు చేసామని కోవిడ్ ను సైతం లెక్క చేయకుండా ప్రాణాలకు తెగించి ఉద్యోగులు పనిచేశారని అన్నారు. తాను చైర్మన్ గా ఉన్న సంవత్సరం లో సహకార బ్యాంకు ను దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపామని వివరించారు. రాజకీయాల్లో ఉన్నంత వరకు బ్యాంకు బాగోగులు చూస్తూనే ఉంటానని బ్యాంక్ అంటే తనకు అంతా మక్కువ అని చెప్పుకొచ్చారు. బ్యాంక్ జీఎం, ఏసిబి కేసు ఎదుర్కొంటున్న రంగ బాబు వైసీపీ నేతలతో అంటకాగి.... కేసు మాఫీ చేసుకునేందుకు నేడు టీడీపీ వ్యక్తిని అని చెప్పుకుంటున్నారని ఆరోపించారు. బ్యాంక్ కు పట్టిన శని రంగబాబు అని దుయ్యబట్టారు. బ్యాంక్ ఉద్యోగుల కోసం జీతాలు పెంచేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉద్యోగుల పదోన్నతుల విషయంలో కూడా అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వంలో సహకార సొసైటీల్లో అనేక అక్రమాలు జరిగాయని వారిపై విచారణ జరపాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేయడంతో పాటు అసెంబ్లీ లో కూడా మాట్లాడానని చెప్పారు. తాను పని చేసిన 13 మాసాల సమయాన్ని కూడా కలుపుకుని 51 ఎంక్వరి వేసి నిజాలు నిగ్గు తెలుతాయి అన్నారు. ఎస్సి, ఎస్టీ అభ్యర్థులకు ప్రమోషన్లు ఇచ్చి వెనక్కి తీసుకోవడం సరికాదని భావిస్తున్నా నన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని, తక్షణమే ధర్నా ను విరమించాలని అభ్యర్థులను కోరారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com